# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 10 పరాభవ - నిజజ్యేష్ఠ శుద్ధ విదియ, 17 జూన్ 2026

## శతావధాని పిశుపాటి చిదంబర శాస్త్రి

(1892 - 1951)



శ్లో॥ కాంకే ఖగే ఘే ఙ్ఞ చచే ఛచాఛో
జార్ఝేఞ్ టేరే డఢఢ ణ తోథ
ద దాం ద ధానో నున పా ప పో పః
బభౌ మయూరో లవశేషసింహః

ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం
అవధాన విద్యా విజయతే తరామ్

**అవధాన విద్యా వికాస పరిషత్ - ఐదవ అవధాన,పద్య శిక్షణ శిబిరం**



శ్రీ ఉప్పలధడియం భరతశర్మ
ఏకదిన సంపూర్ణ శతావధానం

శ్రీ మల్లినాథ అవధాన ప్రాంగణం,
సెయింట్ మార్ఖ్ హై స్కూల్, నేరేడ్ మెట్, భాగ్యనగరం



శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్
అర్ధ శతావధానం

శ్రీ మల్లినాథ అవధాన ప్రాంగణం,
సెయింట్ మార్ఖ్ హై స్కూల్, నేరేడ్ మెట్, భాగ్యనగరం



తిరుక్కోవల్లూరు శ్రీహర్ష అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం



శ్రీమతి మండపాక మహేశ్వరి గారి అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 10

పరాభవ - నిజజ్యేష్ఠం 2026 | 17-06-2026 | ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని

## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య
కౌండిన్య తిలక్

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ

**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

అవధానవిద్యా విజయతే తరామ్

## సంపాదకీయం

# అవధానాలవల్ల అన్నీ నష్టాలేనా!?

సీ. ధారణాశక్తి విస్తారమై యుండుట బుద్ధివిశేషము పూజ్యమగును
ఆశుకవిత్వవిహారమై యుండుట కల్పనాప్రౌఢి మంగళమెయగును
శబ్ద సౌష్టవము యోజన సేయగానెంచ ధీవరామోదమౌ తెన్నుగాంచు
సతతమాలోచనాసరణి నుండుట మది పోడిమిగన పరిపూర్ణ మగును

తే.గీ. ఇట్టియవధాన మొనరించు యలఘుమతుల
ప్రమద వార్నిధి ప్రబల భంగములుకావె
యూతెఱుంగులు మిత్రమా! యెట్టులనిన
స్వానుభవమౌట జెప్పగ జాలినాము

(ప్రతాపవేంకటేశ్వరకవి.. చేబ్రోలు శతావధానం. 10-03-1918)

అవధానాలు చేసి అందరినీ మెప్పించడం సామాన్యమైన విషయం కాదనీ స్వానుభవమున చాటిన సందేశమిది. ఆశుపద్యరచనావేగం, ధారణానిర్వహణకు మనస్సును సిద్ధపరుచుకోవడం ప్రధానం కనుక సముచిత భావరస సంగ్రహణకు అవకాశం చాలదని ఒక అభియోగం అవధాన కవులపై ఆనాడే వ్యక్తమైంది.

అవధానం చేయడంవల్ల కవితా శక్తికి ఏమైనా లాభం ఉన్నదా? పోనీ లోకానికేమైనా లాభమున్నదా? అని నాటి భావకవుల ప్రశ్నలు. దానికి శేషాద్రి రమణకవులిచ్చిన సమాధానం చూద్దాం. అవధానకవి వివిధ విద్యా శాస్త్ర వివేకశాలియై ఉంటాడు (ఉండాలి) కనుక సదస్యుల సందేహాలకు పద్యరూపంలో తీర్పులిస్తాడు. పృచ్ఛకులడిగే సందిగ్ధాంశాలకు పరిష్కరిస్తాడు. అవధాని ప్రత్యుత్తరాలన్నీ ఛందోరూపంలో ఉంటాయి కనుక అడిగిన వారు విని కంఠస్థం గావించుకోవచ్చు. అవధానం ధారణా విద్యకనుక అవధాని వివిధ గ్రంథాధ్యయనఫలితంగా విన్నవీకన్నవీ సందర్భోచితంగా సద్యస్ఫురణతో అందరికి అందించవచ్చు. అవధానపూర్వకంగా స్వాధీనమైన నిరర్గళాశుధారతో ఉద్గ్రంథరచన చేయవచ్చు.

"ధారావచో విధేయముగా విషయ సంగ్రహణ శక్తి సహజముగా సద్యస్స్ఫురణము అభ్యాస సాధ్యముగా ఉన్నప్పుడు కవి సారస్వతమున ఉన్నత పదవి వడయుటలో అచ్చెరువు లేదు"

అవధాన రంగంలో అడుగుపెట్టే ప్రతికవీ ఇంతటి ప్రతిభను స్వంతం చేసుకుంటే అవధానీ, అవధానం ఉన్నత స్థితిలో ఉండితీరుతుంది అనడంలోనూ సందియంలేదు.

# సంస్తుతి

సీ. ఏ దేవి కర పరివాదినీ క్వణనంబు
  శ్రుతిసంజ్ఞ నిగమ సంతతికి నొసగు
నే దేవి చరణమంజీర శింజితములై
  పదునాల్గు విద్యలు పరిఢవిల్లు
నేదేవిగొని శుద్ధ వైదికుండగుతాత
  చతురాస్య బిరుదంబు సంతరించు
నేదేవిదరహాస మేదురాపాంగలీ
  లలు చతుష్షష్టి కళాపదమ్ము
తే.గీ. లేమహాదేవి కాంచికాదామరవము
లఖిల జీవచైతన్య విహార భూము
లా మహాదేవి శ్రీ శారదాంబ నాదు
పలుకు పలుకున నమృతంబు జిలుకుగాక!

సేతుబంధమహాకావ్యము (ఆంధ్రానువాదము)
మూలం:-ప్రవరసేనుని ప్రాకృతకృతి
విద్వచ్ఛిరోమణి, సంస్కృతాంధ్రాష్టావధాని
అవధానం చంద్రశేఖర శర్మ

ఈ అందమైన పద్యం సరస్వతీ దేవి (శ్రీ శారదాంబ) వైభవాన్ని మరియు కరుణను కీర్తిస్తూ చెప్పబడినది.

**వేదాలకు శ్రుతి సంజ్ఞ:** ఏ దేవి చేతిలోని సప్త స్వరాలను పలికించే వీణా నాదం వేదసమూహానికి శ్రుతి అనే సంజ్ఞను (గుర్తింపు) ప్రసాదిస్తుందో...

**పదునాల్గు విద్యలు:** ఏ దేవి కాళ్ళ అందెల (మంజీరముల) మధుర ధ్వనుల నుండి పదునాల్గు విద్యలు (నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, పురాణం, న్యాయం, మీమాంస, ధర్మశాస్త్రం) పుట్టి విరాజిల్లుతున్నాయో...

**బ్రహ్మదేవుని చతుర్ముఖత్వం:** ఏ దేవిని ఆశ్రయించి, ఆమె అనుగ్రహం వల్ల పరిశుద్ధుడైన వైదికుడైన తాత (సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు) "చతురాస్యుడు" (నాలుగు ముఖాలు కలవాడు లేదా నాలుగు వేదాలకు అధిపతి) అనే బిరుదును పొందాడో...

**చతుష్షష్టికళలు:** ఏ దేవి యొక్క చిరునవ్వుతో కూడిన కటాక్ష వీక్షణాల విలాసాలు అరవై నాలుగు (64) కళల స్థానాలు లుగా విలసిల్లుతున్నాయో...

**జీవచైతన్యం:** ఏ మహాదేవి యొక్క మొలనూలు (కాంచీదామము) గంటల సవ్వడులు సమస్త ప్రాణుల చైతన్యానికి విహార భూములో...

**వాక్సుధ:** ఆ మహాదేవి అయిన శ్రీ శారదాంబ నేను పలికే ప్రతి మాటలోనూ అమృతాన్ని కురిపించుగాక (నా పలుకులను అమృతమయం చేయుగాక) అని కవి ప్రార్థిస్తున్నారు.

## ఇదీ క్రమణిక


1. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... . 3
2. అంశావలోకనం ... ... ... ... ... ... ... .. 4
3. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 6
4. హైదరాబాద్ అవధానశిక్షణశిబిరం ... ... ... 8
5. పద్యపరీమళం ... ... ... ... ... ... 11,22,23
6. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 12
7. నిఘంటుపరిజ్ఞానం... ... ... ... ... ... ... 13
8. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 14
9. పూరణతోరణం ... ... ... ... ... ... .. 16
10. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
11. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 20
12. సత్కవిప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం ..21
13. ప్రహేళికా ... ... ... ... ... ... ... ... ... 22
14. సంస్కృతం సంస్కృతి ... ... ... ... ... .. 24




## సుహృద్వాణి

అవధాన పుష్కరిణి పత్రిక ప్రతినెలా చదివిస్తున్నది. సుప్రసిద్ధులు వ్రాస్తున్న వ్యాసాలు అవధానులకే కాదు సామాన్యపాఠకులకు కూడా అనుసరణీయములు. పద్యరచన చేసేవారికీ ఉపయోగపడే విశిష్టరచనలతో అలరారుతున్నదీ పత్రిక.

– నారాయణమూర్తి

తొలిపేజీ నుండి చివరిపేజీ దాకా అనర్ఘరత్నాలలాంటి విషయాలను అందిస్తున్నారు. అభినందనలు

– రవికుమార్

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

**పోరులం దెగి నీదు మార్తురు ప్రొద్దు నెన్నడు మొక్కటం
జేరి బల్విడి దూరి బంగరు చేలమున్ సిరితోడి సిం
గారము న్సుడివాలు జిందము గల్గి సొంపుల మీరుచున్
రారు వేలుపు జాన లిండ్లకు రాసిరిం దగు నేర్పరీ!**

ఇది తొలి తెలుగు అచ్చ తెనుగు కబ్బం – "యయాతి చరిత్రము" లోని ప్రథమాశ్వాసంలో చివరి పద్యం. "మత్తకోకిల" ఛందంలో మధురంగా సాగిన పద్యం ఇది. దీనికి ముందు కృతికర్త పొన్నికంటి తెలగన కవి – దాదాపు 30 పద్యాలలో యయాతి మహారాజు యొక్క కొలువుకూటాన్ని గురించి; అతని ఐశ్వర్య వైభవాన్ని గురించి; అతని రాజ్యంలోని వనాలు, అందులోని పులులు, సింహాలు, ఏనుగులు మొదలైన జంతుజాలాన్ని గురించి; పల్లెలోని తోటల గురించి; వన్య మృగాల వలన ఇబ్బంది పడుతున్న చెంచులను, పల్లెల లోని ప్రజలను రక్షించేందుకు మహారాజు వేటకు వెళ్ళాలని వేటగాళ్ళకు ప్రకటించే ముందు అందు కోసం వినియోగించే వివిధ రకాల వలలు, ఇతర వేట సాధనాల గురించి చాల వివరంగా, కవితాత్మకంగా వర్ణించారు. ఇక .. ఆశ్వాసాంతములోని ఈ పద్యంలో కవి యయాతి ప్రభువును ప్రత్యేకమైన తాత్త్వికాంశాలతో ప్రస్తుతించారు.




ముందుగా – ఈ పద్యంలోని అచ్చ తెనుగు పదాలు, పద బంధాల పోహళింపును, వాని భావార్థాలను పరిశీలిద్దాం.

**పోరులం దెగి** = యుద్ధాలలో మరణించి
**మార్తురు** = శత్రువులు
**ప్రొద్దు** = సూర్యుడు
**ప్రొద్దు నెన్నడుము** = సూర్యుని అందమైన నడుము భాగం (సూర్య బింబంలోని నడిమి భాగం అన్న అర్థంలో)
**ఒక్కటన్** = ఒక చోట
**బల్విడి** = బలప్రయోగంతో
**బల్విడి దూరి** = ఛేదించి లోపలికి చొచ్చుకొని పోయి
**సుడివాలు** = చక్రము
**చిందము** = శంఖము
**వేలుపుజానలు** = అప్సరసలు
**రాసిరిం దగు నేర్పరీ** = రాచరికపు ఐశ్వర్యాలందు రాటుదేలిన వాడా! (యయాతి మహారాజును సంబోధిస్తూ ..)

ఇక .. ఈ పద్యంలోని భావాన్ని, తాత్త్విక అంశాలను విశ్లేషిద్దాం.

"ఓ రాచరికపు ఐశ్వర్యాలందు రాటు దేలిన యయాతి మహారాజా! యుద్ధంలో మరణించిన నీ శత్రువులు సూర్యుని నట్ట నడిమి ప్రదేశాన్ని ఛేదించి లోనికి చొచ్చుకొని పోయి, ఆవలి వైపున – బంగారు వస్త్రం, లక్ష్మీదేవి సింగారంతో బాటు, శంఖు చక్రాల సొగసులను అతిక్రమించి, అవి వదులుకొని, స్వర్గంలోని అప్సరసల ఇళ్ళకు రారు" అని ఈ పద్య భావం.

యుద్ధంలో వీరోచితంగా పోరాడి మరణించిన వారు పుణ్య లోకాలకు వెళతారని, వారు నరక ప్రాప్తి పొందే అవకాశమే లేదని తరతరాల ప్రజల విశ్వాసం. "విజయమో .. వీర స్వర్గమో.." అన్న నానుడి అందరికీ విదితమే! ఇక – ఆధ్యాత్మికంగా చెప్పాలంటే.. మరణించి, మోక్షం అర్హతను పొందినవారు సూర్యుని లో చొచ్చుకొనిపోయి, దాటుకొని దానికి ఆవల ఉన్న శ్రీవైకుంఠం చేరుకొంటారని ప్రతీతి. దీనిని శ్రీవైష్ణవ సంప్రదాయంలో – "విష్ణు సాయుజ్యం" లేక "పరమపద ప్రాప్తి" అంటారు. అక్కడికి చేరిన ఆత్మలు మళ్ళీ వెనుకకు వచ్చి భూలోకంలో జన్మించవు. ఇక వైకుంఠ ప్రాప్తి లభించక, స్వర్గ ప్రాప్తి మాత్రమే పొందిన ఆత్మలు స్వర్గంలోని అప్సరసలతో సుఖ భోగాలను అనుభవించి, పుణ్య కర్మఫలం తీరాక, తిరిగి భూలోకంలో జన్మించే అవకాశం ఉంటుంది.

పొన్నికంటి తెలగన కవి – యయాతి మహారాజుకు శత్రువులైనా .. యుద్ధ రంగంలో అతని చేతిలో హతమైతే .. వారు వైకుంఠ ప్రాప్తినే పొందుతారు కాని, వారు అవి వదులుకొని, స్వర్గంలోని అప్సరసల ఇళ్ళకు రారు... అని నిర్ధారించి చెప్పారు. ఆ రకంగా యయాతి మహారాజు తన శౌర్యం ద్వారా, తన శత్రువులకు విష్ణు సాయుజ్యం కల్పించిన వీరునిగానే కాక, వారికి జన్మరాహిత్యాన్ని కల్పించిన పుణ్యాత్మునిగా కూడ ప్రస్తుతించారు. ఇక ఈ పద్యంలో కవి వైకుంఠాన్ని వర్ణించిన తీరు మహాద్భుతం! ఎక్కడ కూడ, శ్రీమహావిష్ణువు అని గాని .. శ్రీమన్నారాయాణుడు అని గాని పేర్కొనకుండానే .. బంగారు వస్త్రం ధరించి, ఎదలో కొలువైన శ్రీమహాలక్ష్మీదేవి సింగారంతో బాటు, శంఖు చక్రాలను చేబూనిన సొగసులను (విష్ణుమూర్తి భక్తులు ఒక్కసారి కళ్ళు మూసుకొని, ఈ అంశాలను తలపోస్తూ, ఊహించుకొంటే ఆ పరాత్మరుని సాక్షాత్కారం కాక తప్పదు) వర్ణించి చెప్పి, ఆ సొంపుల ముందు స్వర్గంలోని అప్సరసల అందాలు, సాంగత్యం – తృణ ప్రాయం అని చెప్పడం ఒక అద్భుతమైన అభివ్యక్తి. ఆ విధంగా స్వర్గ సౌఖ్యాల కన్న శ్రీమన్నారాయణ పద సన్నిధిలో పొందే బ్రహ్మానంద సౌభాగ్యమే పరమోత్కృష్టమైనదన్న తాత్త్విక సందేశాన్ని అందించారు ఈ పద్యంలో .. పొన్నికంటి కవి.

## అంశావలోకనం

శతావధాని ఆముదాలమురళి

## డా. ఆశావాదిగారి అవధానాలు నిషిద్ధాక్షరి

*(గత సంచిక తరువాయి)*

నిషేధాక్షరిలో ప్రత్యక్షర నిషేధం ప్రసిద్ధమైన పద్ధతి. కాగా కొందరు పృచ్ఛకులు కొన్ని అక్షరాలను ఒకేసారి నిషేధించి పద్యం చెప్పమంటారు. శ్రోతలకు చాలా సులభంగా అనిపిస్తుంది కాని అది క్లేశతరమైనదే. అనునాశికాలు రాకుండా ముక్కు చెవులు కోల్పోయిన శూర్పణఖ తన గోడును రావణునికి చెప్పుకోవడాన్ని చెప్పమంటారు. ఇటువంటివి ఎంతో క్లిష్టమైనవి. ఆశావాదిగారికి కర్నూలు అవధానంలో గ,ణ,ప,తి అనే అక్షరాలు రాకుండా గణపతిని స్తుతించమని నిషేధాక్షరి పృచ్ఛకుడు కోరినప్పుడు వారు చెప్పిన పద్యం ఇలా ఉంది.

కం. వరదా! వశీధీ! క్షమా
క్షర సౌధ స్థిర సుమోద సర్వాధీనా!
దరి జేర్చన్ నిను వేడెద
నురుకుక్షీ సూక్ష్మదర్శి ఉజ్జ్వల శీర్షా!

ఉరుకుక్షీ అనే విశేషణం గణపతిని సూచిస్తుంది. మిగిలినవన్నీ గణపతికి, విశేషణాలు కాగా, గ,ణ,ప,తి అనే అక్షరాలు రాకుండా అవధాని జాగ్రత్తపడ్డారు.

'రొళ్ళ'లో జరిగిన అవధానంలో పృచ్ఛకులు, సంస్కృతాంధ్రాలలో మహాపండితులైన డా. కొడిమడుగు నాగేశ్వరశాస్త్రిగారు దశావతారస్తవాన్ని కోరారు. మూడు పాదాలు నిషేధం జరిగింది. అవతల ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలిగిన విద్వాంసుడు పృచ్ఛకుడు. పంచధకారాల్లో ఇప్పుడు ప్రధానంగా కావలసినది ధైర్యం. ఇలాంటి ప్రశ్న, అలాంటి పృచ్ఛకుడు ఎదురుగా ఉన్నప్పుడు ఏమాత్రం భయం కనిపించినా అవధానం గంగలో కలిసిపోతుంది. డా. ఆశావాది చెప్పిన పద్యం చూద్దాం.

కం. వనభూజలాట రూపుల్
ఘనదేహయతుల్ సుధర్మకర్ముల్ లోకా
వనదీక్షులు నౌహరి పా
వన దశమూర్తుల దలంప భద్రము కల్గున్.

హరిపావన దశమూర్తులు అంటే శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలు. ఇది నాలుగో పాదం. మిగిలిన పైమూడు పాదాల్లో దశావతారాల్లో ఎన్నింటిని అవధాని పేర్కొన్నారో పరిశీలిద్దాం. వన, భూ, జల శబ్దాలపై అట చేరింది. అట-సంచరణే అని ధాతువు. 'నీరాట వనాటములకు...' అని పోతన. భూచర, వనచర, జలచర రూపాల్లో శ్రీమహా విష్ణువు ఏఏ అవతారాలు ధరించాడో చూద్దాం. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ అవతారాలకు మొదటి పాదం అన్వయిస్తుంది. 'రూపుల్' పదం విరిగిపోయింది, తరువాత రెండో పాదం మొదలవుతుంది. ప్రాస కలిసివచ్చింది. ఘన శబ్దం ఇమడ్చడంతో వ్యూహం మొదలైంది. దేవ, దేహలను మనసులో ఉంచుకొని అవధాని'దే' అని అంటారు. పృచ్ఛకులు 'వ' నిషేధించి ఉంటారు. దేహ వచ్చింది. ఘనమంటే మేఘమని, బలమైన అర్థం. కాబట్టి రామ, బలరామ, కృష్ణులు వచ్చినట్లే. అవధాని పృచ్ఛకులు మహాపండితులు గనుక తరువాత అక్షరం 'య' అన్నారు. 'దేహ' తరువాత 'య' అంటే దేహయష్టి అనే ఊహ పృచ్ఛకులకు స్ఫురించి ఉంటుంది. అవధానికి కావలసిందదే. యతుల్ అన్నారు. పరశురామ, వామనావతారాలకిది అన్వయం. సుధర్మకర్ములు, లోకావనదీక్షులు బౌద్ధ, కల్కి రూపాలు. నిషేధాక్షరిలో పదితోపాటు బలరామావతారాన్ని కూడా అవధాని విజయవంతంగా అవతరింపజేశారు. నిషిద్ధాక్షరి నిర్వహణలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు.

పౌరాణిక అంశాలకు సంబంధించిన అంశాలను సాధారణంగా సీతారామ కళ్యాణం, పార్వతీ పరిణయం వంటివి ఇచ్చి పద్యాన్ని అల్లమనడం సహజం. కొంత మార్పుతో పైడిలేడిపై ఆశగొన్న సీతను గూర్చి వారిలా చెప్పారు.

కం. స్థిరవపు గాదని కుజతా
వరైణమున్ గోరుటన్ ప్రవాసమ్మొందెన్
ధరనీస్థితి స్త్రీజాగ్రత్
వరభావమె తన శిరాన భరియింపవలెన్

భగవంతుడు అవ్యయుడు, శ్రీరాముడు భగవదవతారం. అచ్యుతుడైన వానిని స్థిరవపుడనడం ఎంతో సమంజసము. శాశ్వతుడైన తన రాముని కాదని 'కుజ' అనగా సీత, భూమి నుండి పుట్టినదని అర్థం. రెండూ ఏకాక్షరాలే. 'కు' అన్న తర్వాత పృచ్ఛకునికి 'జ' స్ఫురించకపోవడం అవధాని అదృష్టం. వరఏణము వాగర్థములవలే ఉన్నదనుట ప్రసిద్ధ కాళిదాసు శ్లోకము. వరఏణము వరైణమైనది. కందంలో నాలుగో గణం జగణం రావడం అరుదైన అందం. మామూలు జింక కాదు కాబట్టి 'వర' అనే విశేషణం కూడా సముచితమే. దాన్ని సీత కోరుకోవడంవల్ల ప్రవాసాన్ని పొందాల్సి వచ్చింది. కోరుట, ప్రవాసము మొదలగు పదాలు అవధాని వాడారంటే పృచ్ఛకుని బేలతనం స్ఫుటమౌతున్నది. అవకాశం దొరికినప్పుడు వినియోగించుకోవడం కూడా ప్రతిభే కదా! ఇంతవరకు పృచ్ఛకుడు కోరిన అంశం వచ్చేసింది. పద్యం ఇంకా రెండు

పాదాలు మిగిలిపోయింది. సంప్రదాయం తెలిసిన కవులు ఇటువంటి పరిస్థితిలో కావ్యాల్లో అనుసరించే వ్యూహమే అర్థాంతరన్యాసాలంకారం. కావ్యమర్మజ్ఞుడైన ఆశావాది సరిగ్గా ఈ వ్యూహాన్నే అనుసరించారు. శాశ్వత సత్యమైన భగవంతుని కాదని తళుకు బెళుకు రాళ్ళవంటి ఐహిక ఆకర్షణలకు లోనైన వాడికి భగవంతునికి దూరమైపోతారనే ఆధ్యాత్మిక ప్రబోధం ఇందులో ఉన్నది. అంతేగాక లౌకిక దృష్టితో చూసినపుడు స్త్రీలు తమ జాగ్రత్త కొరకు అనుసరించాల్సిన పద్ధతులను గూర్చి సీత మూలంగా హెచ్చరించడం కూడా జరిగింది. ఇన్ని ప్రత్యేకతలతో నిషిద్ధాక్షరి పద్యమల్లడం డా. ఆశావాదికే చెల్లింది.

డా. సీ.వీ. సుబ్బన శతావధానిగారు నిషేధాక్షరులను దుష్కర ప్రాసతో మొదలు పెడతారు. మిగిలిన ప్రాస సామాగ్రిని గూర్చి పృచ్ఛకుడు ఆలోచించే లోపు పద్యాన్ని పూర్తిచేస్తారు. ఇది పృచ్ఛకుని భయపెట్టే వ్యూహం. డా. ఆశావాదిగారు కూడా ర్ణ, న్య, ధ్న, త్న్న మొదలగు దుష్కర ప్రాసలతో నిషేధాక్షరులు నిర్వహించారు. డా. మంకాల రామచంద్రుడుగారు ఆశావాది సాహిత్యానుశీలనం చేస్తూ, సంస్కృతాంధ్రాలలోని దాదాపు 120 ఏకాక్షర పదాలను నిషేధాక్షరులలో వాడినట్లు పట్టిక ఇచ్చారు. ఆ పట్టిక ననుసరించి డా. ఆశావాదిగారి ప్రజ్ఞాపాటవాలను అంచనా వేయవచ్చును.

ఒక్క అంశాన్నిచ్చి పద్యం చెప్పమంటేనే ఇలా ఉంటే, రెండు అంశాలనిచ్చి జమిలిగా చెప్పమంటే ఉండే క్లేశం వర్ణనాతీతం. అటువంటి సందర్భాల్లో కూడా నిషిద్ధాక్షరిని నల్లేరుపై బండి నడకలా అవధాని నడిపించారు. అర్ధనారీశ్వర స్తుతిని అడిగినప్పుడు ఆశావాదిగారు చెప్పిన పద్యమిది.

కం. శ్రీపుష్ప చంద్ర మస్తా
స్త్రీ పుం యుగలాస్య భీద చిహ్నా ఇలకున్
ప్రాపగు వసునాగాంగద
రూపము వాగర్థములటు రూఢము గాదే.

శివపరమైన విశేషణాలతో దయామయ, కరుణాకర అంటూ, కొనసాగించి నాలుగో పాదంలో అర్ధనారీశ్వరా అంటే గట్టెక్కిపోతా మని సాధారణంగా ఏ అవధానైనా ఆలోచించే ఈ సందర్భంలో డా. ఆశావాదిగారు అల్లిన పద్యం నిషేధాక్షరికి పెద్దబాలశిక్ష వంటిది. ఆయన వాడిన ప్రతి విశేషణంలోనూ శివపార్వతులకు సమన్వయించేదిగా ఉన్నది. అర్ధనారీశ్వర రూపం వాగర్థములవలే ఉన్నదను ఉపమానం ప్రసిద్ధ కాళిదాస శ్లోకమే.

అందులో విశేషమేమున్నది? సంస్కృతంలో వాక్ స్త్రీ లింగము, అర్థం పుం లింగము. వాక్కు పార్వతి, పరమేశ్వరుడు అర్థము. ఇదేక్రమంలో మిగిలిన విశేషణాలను అవధాని కూర్చడమే ఇందులో ఉన్న విశేషము. శ్రీకారం మంగళవాచకం. 'పుష్పచంద్ర మస్తా' తలలో పువ్వులు, చంద్రుడు ఉన్నారు. 'స్త్రీ పుంయుగ' స్త్రీ పురుషుల జంట, 'లాస్య భీదచిహ్నా'లో శివుని నాట్యాన్ని తాండవ మంటారు. అమ్మవారి నాట్యాన్ని లాస్యమంటారు. పరమేశ్వరుడు భీతినిగొల్పు చిహ్నాలు కలవాడు. వారి ఆభరణము వసునాగములు. ఈ మొత్తం విశేషణాల్లో మొదటవన్నీ పార్వతికి సంబంధించినవి, రెండవది పరమేశ్వరునికి సంబంధించినవి ఎన్నుకొని వాటిని ఏకసమాసంగా కూర్చడంలో అర్ధనారీశ్వర తత్త్వం ఇమిడి ఉన్నది. కూర్చొని పద్యమల్లినా ఇంత ప్రణాళికాబద్ధంగా అల్లడం కష్టసాధ్యమే.

అదే విధంగా తిరుత్తణి అవధానంలో తిరుత్తణిలో నెలకొన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి, తిరుమలలోని వేంకటేశ్వరస్వామికి అభేదాన్ని వర్ణించమని కోరినప్పుడు చెప్పిన పద్యం.

కం. శ్రీవల్లీనా నగధా
త్రీవశి దశవాహ దీప్త దేహా తిరు సం
జ్ఞావరచిత్ శక్తీ ! రా
నా వాగ్యజ్ఞంబు నందు నర్తింపు ప్రభూ !

సుబ్రహ్మణ్యుడు శ్రీవల్లీ దేవసేన సమేతుడు, వేంకటేశ్వరుడు లక్ష్మీదేవి అను తీగకు ఆలంబనమైనవాడు. వల్లీ పదం ద్వారా అవధాని సాధించిన శ్లేష నిరుపమానం. ఇద్దరూ కొండమీద ఉన్నవారే. ఇద్దరూ పక్షి వాహనులే. ఇవి విశిష్ట విశేషణాలు. తిరుసంజ్ఞ కూడా రెండుచోట్లా ఉన్నది. దీప్త దేహం, చిత్ శక్తి ఏ దేవునికైనా సరిపోయే సాధారణ విశేషణాలు. నిజంగా అవధాని కోరుకున్నట్లు వారిద్దరూ వచ్చి ఈ వాగ్యజ్ఞంలో నర్తిస్తున్నట్లే పద్యమున్నది.

ఎలాగోలా గండం గడిస్తే చాలనే భావనతో కాకుండా, పటిష్ట ప్రణాళికతో సమర్థవంత పద సామర్థ్యంతో ఆశావాదిగారు నిషిద్ధాక్షరులను నిర్వహించిన ప్రతిభ వారి ప్రతి అవధానంలో ద్యోతకమౌతుంది. మల్లెమొగ్గ, సుద్దముక్క, కాలలీల, జాతీయ పతాకం, చిన్నారులు, పెనుగొండ మొదలగు అనేక అంశాల మీద నిషేధాక్షరిలో వీరు చెప్పిన పద్యాలు సరస్వతీ మకుట మాణిక్య సదృశాలు. డా. సీ.వీ. సుబ్బన్న శతావధాని గారి తర్వాత అంత గంభీరంగా చక్కగా, చిక్కగా నిషేధాక్షరులను నిర్వహించిన డా. ఆశావాది ప్రకాశరావుగారు, గురువుకు తగ్గ శిష్యులనిపించుకున్నారు.

అవధానాల్లో నిషేధాక్షరులు భూతోచ్చాటన మంత్రాల వలే ఉంటాయన్న ఆరోపణలకు ఆశావాదిగారి నిషేధాక్షరులు మినహాయింపు. పాంకముగల ప్రౌఢవలే వీరి నిషేధాక్షరులు నిర్నిషేధంగా ఆకర్షిస్తాయి.

# విశిష్ట తెలుగు భాషా వైభవం
## 10 ఛందః ప్రాముఖ్యం




- డా. సంగనభట్ల నరసయ్య

నైసర్గిక మాత్రల సమకాలఖండం, త్ర్యక్షరగణవ్యవస్థ సులోచనాలతో చూసి దేశి పాటలకు సమన్వయించి దేశి గణాలు నిర్మించారు.

పంచమాత్రిక ఇంద్రగణ వ్యవస్థలో భ, నల చేరడానికి వైయాకరణ సమ్మత లేఖన విధానం కారణం. దీంట్లో మౌఖిక, లేఖన విధానాల్లోని ఘర్షణను రేచన **"వెలయగ చెఱకు విలు గొని..."** పద్యంలో 'ఛందశ్శాస్త్రస్థం' చేసినాడు. దీనిని సంప్రదాయ పండితులు త్ర్యక్షరగణ్వయవస్థా విధేయులై మరింత లోతుగా వెక్కిరించి **"గురువు లఘువు చేసి కుంచించి కుంచించి..."** అని చాటువాడినారు. పాట పలుచ పద్యం గొప్ప అనే భావంతో తిక్కన నిర్వచన ఉత్తర రామాయణం (అంతా ఛందమే, వచనం లేదు) నుండి

**"ద్విపద్మావ్యంబు ముదిలంజ దిడ్డికంత"**

**పదకవితలు - మారువాస బాపనవారల్"** వంటి క్షుద్ర భావనలు అభివృద్ధి చెందాయి.

ముందు చెప్పిన **"తొలికోడి....."** పాదంలో **'వంచీ'** ఆఖరు పంచమాత్రల గణం. **చీ** తరువాతి చుక్క ఒకమాత్రాకాలపు నిశ్శబ్దం అని మూడు కొలతలను గుర్తించాలి. ఈ నిశ్శబ్దం మాత్రాగణం పూరణంకోసం. ఏక, ద్వి, త్రిమాత్రాకాలం కూడా కావచ్చు. అది రాయక (అనగా 'ధ్వనివిధేయలిపి'గా రాయక) 'వంచీ'లోని గుడి దీర్ఘం వ్యాకరణసమ్మతం కాక 'వంచి' అని రాసిన కారణంగా UI తో హగణంగా గుర్తించబడింది. చాలా దేశిపద్యాల్లో పాదాంత సూర్యగణం ఉండటానికి ఇదే నిశ్శబ్దం కారణం. ఇదే త్రిమాత్రికం మరో గేయంలో నగణంగా గుర్తించినపుడు న, హలు సూర్యగణాలుగా మరో వర్గంగా నిర్ణయించారు.

గౌరమ్మ ముద్దుల కొడుకా
గౌరీశం తరునీ కొడుకా

కొడుకా / కొడుక అని ద్వైవిధ్యంగా రాయవచ్చు. కొడక నగణం.

సిరామ సింతల్లు వలలో
సిగురూ మామిళ్లూ వలలో
సీతను యెవ్వరూ వలలో
సెరగొ న్నారమ్మా వలలో

ఇక్కడ వలలో నగణం. దీన్ని గాయకులు భిన్నంగా కూడా పాడుతారు. వలలో అనేది వల్లొగా ఉచ్చరిస్తారు. భిన్నంగా మారడం గేయసంప్రదాయంలో ఓ మౌలికాచారం. రెండూ గుర్తిస్తే (న,హ గణాలు) సూర్యగణవర్గంగా "ఏదైనా ఒక సూర్యగణం వాడవచ్చు" అనే నియమంగా మారింది. 'దినకర ద్వయంబు తేటగీతి' అనే తే.గీ. లక్షణం చదివినవారు రెండు సూర్యగణాలుగా ఏ సూర్యగణమైనా వాడవచ్చుగదా అని లక్షణం అర్థం చేసికోవడం వెనుక మర్మం ఇదే.

ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు త్ర్యక్షరవ్యవస్థతో జానపద గేయగతుల కాలఖండాలను కొలిచిన కారణంగా అసమాక్షర గణాలు, సమమాత్రికాగణాలు ఏర్పడ్డాయి.

దేశి పద్యాల్లో ఇన్ని గణాల తర్వాత యతి అని నియమం ఏర్పడుటకు కూడా కాలఖండాలే కారణం.

**"తొలికోడి కనువిచ్చి"** అనే సగం (2 కాలఖండాలైనాక) లయకోసం మరి రెండు కాలఖండాలకు సమ'తులాభారం' చేసి **"నిలిచిమైవంచి"** పేర్చి 'తొలి/నిలి'లకు యతి లేదా ప్రాసయతి కూర్చి లంకె వేసినారు.

ఈ పదం ద్విపదపద్యం. పాల్కురికి సోమునిది. సోమన జానపద గేయగతులను, శిష్టవాఙ్మయ ఛందాల హోదా కల్పించిన ఛందోవారధి. అందుకే ఆయన రచన లక్ష్యం చేసికొన్నాను.

అక్కర పద్యాల్లో వాడే చంద్రగణాలు ఇలాగే పుట్టిన మరో వర్గం. ఆరు ఇంద్రగణాలకు ఒక గురువు లేదా ఒక లఘువు చేరిస్తే 6 X 2 = 12 చంద్రగణాలు, మరి రెండు మల, సహ గణాలు కల్పి 14 చంద్రగణాలేర్పడుతాయి. చేరిస్తే అనడం కంటే గీతాల్లోని కాలఖండాలు కవి పేరిస్తే, వాటిని గణ వ్యవస్థతో ఛాందసికులు కొలిస్తే ఏర్పడ్డాయి అంటే బాగుంటుంది. అక్కరలు వాడటం తగ్గి, చంద్రగణాల అక్కర తగ్గింది. అంతేగాక చంద్రగణాలు రెండు చిన్నగణాలుగా విడిపోవచ్చు.

తెలుగు పదాలు చిన్నవే (ఏకాచ్చ, ద్వ్యచ్కములే) కనుక చంద్రగణములంత పెద్ద పదములు కావు. చంద్రగణాల సైజు కాలఖండాలతో గేయరచన తెలుగుకు నప్పదు. అందువల్ల వటి

ప్రయోగం తగ్గింది. నహ గణమైన 'వెలయుచుండ', 'అతిశయిల్లు' వంటివి న + హ గణాలుగా; రల గణమైన 'ఇంపు మీఱ' వంటివి హ+హ గణాలుగా, ఇలా విడిపోవడం ప్రయోగవైరళ్యానికి మరో కారణం.

త్ర్యక్షర గణవ్యవస్థలో మూడు గురువులను ప్రస్తరించగా 8 గరిష్ఠంగా సంభావ్యగణములేర్పడినవి. ఈ ప్రస్తార విధానమును తెలుగు ఛాందసికులు సురేంద్ర చంద్ర గణవ్యవస్థకు (గణము లేర్పడిన తరువాత) ఆపాదించినారు. ఇది కృతకమే అయినా జ్ఞాపకశక్తి కొరకైనది. కాని లఘువాది గణమునకు ఎడమకు మరొక లఘువుంచుట వంటివి దీని కృతకత్వాన్ని పట్టి చూపుతున్నయి.

కన్నడ, తెలుగు భాషలు లిపి, పదనిర్మాణం, ఛందో వ్యాకరణాంశములలో క్రీ.శ. 5 / 6 శతాబ్దములవరకు ఒకే కుటుంబం.ఈ రెండు భాషలు ఒక కొమ్మకు పుట్టిన రెండు రెమ్మలు. వీటిలో ఛందస్సాదృశ్యము ఎక్కువే. ప్రస్తార విధానములో రెండు భాషలలో ఈ గణములు బ్రహ్మ, రుద్ర, విష్ణు గణములని కన్నడలో; సూర్యేంద్రచంద్ర గణములని తెలుగులో పేరు పెట్టుకొని క్రీ.శ.14వ శతాబ్దము వరకు సమానంగా ఉండి, తెలుగులో తరువాత ప్రస్తారవిధానములోని తొలి రెండు గణములు తొలగించి వాడుకొనుట తరువాతి పరిణామము.

14వ శతాబ్దానికి పూర్వము అక్కరజాతి గణములని, 14వ శతాబ్దం తరువాత సూర్యేంద్రచంద్ర గణవ్యవస్థ (ఇది అనంతామాత్యుని ఛందోదర్పణములో) ప్రారంభము ఐనది. ఈ ఛందః పరిణామమును గుర్తించక తత్పూర్వులైన (క్రీ.శ. 14 కు ముందుదశలోని) పాలుకురికి సోమనాథుల కవితలో ఛందోభంగములని తెలుగు విమర్శకులు పొరపడినారు.

తెలుగు దేశిగణవ్యవస్థ సంస్కృతవ్యవస్థకు భిన్నం. జానపద గేయ నిర్మితిలో కాలఖండ గణనంలో పుట్టిందనేది తాత్పర్యం.

ఈ విధంగా తెలుగు ఛందస్సులు చదువుకోవాలంటే (1) సంస్కృత త్ర్యక్షర గణ నిర్మాణం, (2) దేశ్య గణ (సూర్యేంద్ర చంద్ర) నిర్మాణం, (3) అక్కర జాతి దేశ్యగణ నిర్మాణం, (4) కందగణ నిర్మాణం (చతుర్మాత్రా గణాలు), (5) మాత్రా సమగణ నిర్మాణం (రగడాదులు), (6) తాళ గణ (సాహిత్యం లేక నిశ్శబ్ద కాలఖండాలతో నడిచేవి) నిర్మాణం (ఈ ప్రతిపాదన ఛందశ్శాస్త్రాల్లో లేనిది - సౌకర్యం కోసం నేను సూచించినది) అని షడ్విధంగా పద్యాల / పదాల ఉచ్చారణాకాలాన్ని కొలువవచ్చు.

## పద్యం అంటే గణాలు దొర్లించి రాయడమేనా?

భరతుడు తన నాట్యశాస్త్రంలో ఛందస్సుకు అంగాలను పేర్కొంటూ గణాలు పేర్కొనలేదు. గణమే ప్రధానాంగం కదా! ప్రధానాంగమే పేర్కొనలేదా అంటే అతని మతంలో పాదం దైర్ఘ్యం కొలవడానికి గణం అక్కరలేదు. శార్దూలానికి ఏన్ని అక్షరాలు? 19 అక్షరాలు. ఏన్నిమాత్రల ఉచ్చారణకాలం పడుతుంది అంటే మ = 3 గురు = 6 మా; స = IIU = 4 మా... ఇలా లెక్కించి 30 మాత్రలు పడుతుందని, అలాగే గణవ్యవస్థలో 4, 5, 7, 9, 10, 11, 15, 18 వ అక్షరాలు లఘువులుంచాలని (పరిశేషన్యాయాన మిగతావి అంటే 1, 2, 3, 6, 8, 12, 13, 14, 16, 17, 19వ అక్షరాలు గురువులని) చెప్పితే సరిపోతుంది. గణం అనే మాట ఉచ్చరించనక్కరలేదే! ఈ విధానాన్ని ఛందఃకర్త లాచరించారు కూడా. శ్రుతబోధ మనే ఛందోగ్రంథం "ఆద్యాశ్చే గురవస్త్రి యోయదితః షష్ఠస్తథా చాష్టమః స్యాదేకాదశ.... శార్దూల విక్రీడితం" అని (నేను పైన కుండలీకరణములో చెప్పినట్లు) చెప్పినది. ఐతే పింగళాదులు ఏర్పరచిన గణవ్యవస్థ సౌలభ్యం, జ్ఞాపకశక్తి దృష్ట్యా శ్రేష్ఠమైనది. అదే విధానం మనమందరం నేడు ఆచరిస్తున్నాం.

అయితే గణాలు నేర్చినవాడు కొత్తలో గణాలపేర్పు పాదం కనుక పద్యం రాస్తే పదాలు గణానుసారిగా దొర్లిస్తే సరిపోతుం దనుకునే ప్రమాదం ఉంది. ఒక ఉత్పలమాల రాయాలనుకొని గణాలు భరనభభరవ ఉంటాయని ముందు భగణం కనుక 'రాజులు' అని రాసి రగణానికి పదం వెతికి 'దుష్టుల' అని రాసి ఆపై నగణం కనుక 'యనుచు' అని రాసి ఇలా గణాలు దొర్లించుతూ "రాజులు దుష్టులా యనుచు రాణువ యెల్లను రక్తమాంసముల్" (కల్పితం) అని పాదం పూర్తి చేసి అమ్మయ్య అనుకొని మరో పాదంకు పదాలు వెతుకుతే వంద పద్యాలు అల్లడానికి జీవితకాలం పట్టవచ్చు. ఆర్ధాలను గదిని విడిచి వాహ్యాళి కేగు శబ్దాళులన్నట్టు వాగర్థలు విడాకులు తీసికొంటాయి ఈ పద్ధతిలో పేరిస్తే. మరిలా కాదా? పద్యం రాయడం అంటే నడకలు అనుసరించి పదాలు భావానుగుణంగా దొర్లుతాయి. 'నానానా ననినా ననాన ననినా నానాన నానాననా"అని నడక గణాలు బట్టి కాక వాటివల్ల సాముదాయికంగా లభించే దిశగా ఉంటుంది. పదాలు మూడేసి అక్షరాలకే విరుగాలని లేదు.

భరతుని మతమున గణములు లేవని కాదు. గణములతో పాదమునకు అతడు లక్షణమును నిర్దేశించలేదు. త్ర్యక్షర గణనము లాఘవార్థమన్నాడు. ఛందోౖఽగములలో విధిని పేర్కొన్నాడు.

# అవధాన విద్యా వికాస పరిషత్ - భాగ్యనగరం ఐదవ అవధాన శిక్షణ, పద్య శిక్షణ సప్తాహ శిబిరం

- ఎ. ఉమాదేవి

తెలుగువారికి మాత్రమే స్వంతమైన, ప్రత్యేకమైన విద్య అష్టావధాన, శతావధాన ప్రక్రియ. ఈ అపురూపమైన మేధావికాసక్రీడ తరాలు గడుస్తున్న కొలదీ క్రమంగా కనుమరుగు అవుతుందనే శంక కలుగుతోంది. ఈ రంగం వైపు నేటి యువతను ఆకర్షించి నూతన అవధానులను గుర్తించి ప్రోత్సహించి, భావి అవధానులను తయారు చేయవలసిన ఆవశ్యకత పెరిగింది. ఈ నేపథ్యంలో గత మూడు దశాబ్దాలుగా అవధాన విద్యను అనేక విధాలుగా ప్రోత్సహిస్తూ విశేష కృషి చేస్తున్న శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ గారు నూతన అవధానులకు ఒక శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, భావి అవధానులను తీర్చి దిద్దాలనే బలమైన సత్సంకల్పంతో వ్యవస్థాపక అధ్యక్షులుగా ఏర్పాటు చేసినదే "అవధాన విద్యా వికాస పరిషత్" సంస్థ.

ఈ సంస్థను తొలిసారిగా 2022, జూన్లో ఏర్పాటు చేసారు. ఇప్పటికి నాలుగు శిబిరాలు జరిగాయి. గత శిబిరాలలో పదిమందికి పైగా అవధానులు, వందలాది మందిపద్యరచనా ప్రవీణులు సిద్ధమయ్యారు. ఈ శిక్షణ శిబిరాలు ప్రతి సంవత్సరం మే నెలలో జరుగుతాయి. వీటిలో పాల్గొనడానికి ఎటువంటి రుసుము లేకపోగా వారం రోజులు ఉచిత భోజన వసతి సదుపాయాలను కూడా నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనడానికి పద్యం పై మక్కువ, ఛందస్సుపై, అవధాన విద్యపై ప్రాథమిక అవగాహన, ఆశువుగా పద్యాలు స్వయంగా రచించి ఉండటం లాంటివి ప్రధాన అర్హతలుగా ఛాత్ర అవధానులు కలిగిఉండాలనే నిబంధనతో రెండు తెలుగు రాష్ట్రాల లోని సంవత్సరాల యువకులను ఆహ్వానిస్తారు.

ఈ ఆహ్వానాన్ని స్వీకరించి వచ్చినవారిలో బాలబాలికలే కాక 15నుండి - 65 సంవత్సరాల మధ్య వయసువారు యాభైమందికి పైగా ఉత్సాహంగా ఈ ఐదవ శిబిరంలో పాల్గొనడానికి ముందుకురావడం ముదావహం. వీరిలో తెలుగు పండితులే కాక, ఇతర రంగాలలో ఉద్యోగం చేసి విశ్రాంతి జీవితం గడుపుతున్నవారు కూడా ఉండటం నిర్వాహకులకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఈ విధంగా భాగ్యనగరంలో నివసిస్తున్నవారు, తెలంగాణ లోని వివిధ ప్రాంతాలనుండి, ఆంధ్ర ప్రాంతం లోని అనంతపురం జిల్లా లోని సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ తెలుగు చేస్తున్న విద్యార్థులు 15 మంది, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పాఠశాల విద్యార్థులు మొత్తం 25 మంది ఛాత్ర అవధానులు "అవధాన విద్యా వికాస పరిషత్" నిబంధనలకు లోబడి ఉంటామనే హామీ పత్రం సమర్పించి ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

ఈ శిబిరానికి హైదరాబాదు నగరంలోని నేరేడ్మెట్ ప్రాంతంలో ఉన్న దీన్ దయాల్ నగర్‌లోని సెయింట్ మార్ట్స్ గ్రామర్ హై స్కూల్ వేదికగా ఎంచుకున్నారు. దాని నిర్వాహకులు మావుదూరి మల్లికార్జున్ గారు వారం రోజులపాటు శిక్షణ శిబిరాన్ని నడుపుకోవడానికి సకల సదుపాయాలు కలిగిన తమ భవనాన్ని ఉచితంగా ఇవ్వడమే కాక, ఈ వారం రోజులు ఛాత్రులకు, నిర్వాహకులకు, బోధకులకు, అతిథులకు అవసరమైన అన్ని సదుపాయాలను అందించి వారి విశాల హృదయాన్ని చాటుకున్నారు. వారికి అవధాన విద్యా వికాస పరిషత్ ఎంతైనా ఋణపడి ఉంది. అవధాన విద్య బోధించడానికి ప్రత్యేకమైన పాఠ్యాంశం (సిలబస్) రూపొందించి, ప్రణాళికా బద్ధమైన కాల నిర్ణయ పట్టికతో , విద్యార్థులకు అవధాన విద్యపై సక్రమ అవగాహన కలిగించడానికి తమ అనుభవాలనే పాఠ్యాంశంగా వివరించడానికి ఎందరో ప్రముఖులు ఈ సప్తాహానికి వచ్చారు.

వారిలో శ్రీ దోర్బల ప్రభాకర శర్మ, (మహోపాధ్యాయ బిరుదాంకితులు, భారతదేశం గర్వించదగ్గ సంస్కృత, తెలుగు భాషా పండితులు), శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి( విశ్రాంత గురుకుల ఆచార్యులు ), శ్రీ గౌరీభట్ల మెట్రామ శర్మ (శతావధాని, శతావధాన పంచానన బిరుదాంకితులు), శ్రీ ఆముదాల మురళి (శతావధాని), శ్రీ కోట లక్ష్మీ నరసింహం (సహస్రావధాని), శ్రీ మావుదూరి సూర్య నారాయణ మూర్తి (అష్టావధాని), డా. శ్రీమతి జంధ్యాల సుబ్బలక్ష్మి (అచ్చ తెలుగు శతావధానిని), సంగనభట్ల నరసయ్య(భాషా వ్యాకరణ కోవిదులు), శ్రీ చిటితోటి విజయకుమార్(అష్టావధాని, సంస్కృతాంధ్ర భాషాపండితులు), గౌరీశంకరశర్మ(అష్టావధాని), నారాయణం బాలసుబ్రహ్మణ్యం (శతావధాని), శ్రీ అన్నమరాజు ప్రభాకరరావు (కవి), శ్రీ చింతా రామకృష్ణారావు ( చిత్ర కవిత్వ బంధ కవిత్వంలో విశేష కృషి చేసినవారు) శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ (అసమాన అచ్చతెనుగు అవధాన సార్వభౌములు) విచ్చేసారు. మరెందరో కవిపండితులు పాల్గొన్నారు .

18.05.2026 (సోమవారం) నాడు ఉదయం పది గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభమయ్యింది. ప్రారంభ సమావేశానికి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగావచ్చారు. మహా సహస్రావధాని, ప్రవచనకర్త పద్మశ్రీ డా. గరికపాటి నరసింహారావు గారు విశిష్ట అతిథిగా విచ్చేసి లాంఛనంగా శిబిరాన్ని ప్రారంభించారు.

ఛాత్ర అవధానులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన అద్భుత ప్రసంగాన్నిచేసి విద్యార్థులను ఆశీర్వదించారు. గొప్ప బాధ్యతను చేపట్టిన అవధాన విద్యా వికాస పరిషత్ కార్యవర్గాన్ని అభినందించారు అవధానం నిర్వహించుటకు సెయింట్ మార్క్స్ గ్రామర్ హైస్కూలును వేదికగా కూర్చిన యాజమాన్యం మావుడూరి మల్లికార్జున్ గారి దంపతులను సన్మానించారు. సహకరిస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేదికపై సహస్రావధాని శ్రీ కోటలక్ష్మీనరసింహం, మహామహోపాధ్యాయ డా.దోర్బల ప్రభాకర శర్మ, శతావధాని శ్రీ జీ. ఎం. రామశర్మ, అచ్చతెనుగు శతావధాని శ్రీ డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శతావధాని శ్రీ ఆముదాల మురళి, ద్విశతావధాని శ్రీమతి డా.బులుసు అపర్ణ తదితర గొప్ప అవధానులు, పండితులతో సభ కళకళలాడింది. అనంతరం ప్రాచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి సంచాలకత్వంలో 'అవధాన కళాకౌముది ' శ్రీమన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ (అవధాన విద్యావికాస పరిషత్ తొలి అవధాని) స్వర్ణ (అర్ధ)శతావధానం దైవ ప్రార్థనతో ప్రారంభమైంది. అందులో ముందుగా 13సమస్యలు, తర్వాత 13దత్త పదులు పూర్తిచేసారు స్వల్ప భోజన విరామం అనంతరం 12వర్ణనలు కొన్ని 10ఆశువులు అద్భుతముగా పూర్తి చేసారు.

రెండవ రోజు 19/05/2026 ఉదయం 6 :00 గంటలకు దోర్బల ప్రభాకరశర్మ గారి సంస్కృత పాఠం అనంతరం సాహిత్ గారి స్వర్ణ శతావధానం తిరిగి ప్రారంభమైంది. అందులో భాగంగా మిగిలిన 3 ఆశువులను పూర్తిచేసి అన్ని పూరణలు చేసి, నిర్విరామముగా ధారణ పరిసమాప్తం చేసి ప్రముఖుల ప్రశంసలనందుకున్నారు. భోజనాల అనంతరం అవధాన శిక్షణ ప్రధానాచార్యులు శ్రీ ఆముదాల మురళిగారు అష్టావధానంలోని ప్రాథమిక అంశాలన్నిటి గురించి వివరణాత్మక పాఠం చెప్పారు. అనంతరం వరంగల్ వాసి తిరుక్కోవళ్ళూర్ శ్రీహర్ష గారు అష్టావధానం చేసి చక్కని ధార, ధారణలతో పలువురి ప్రశంసలనందుకున్నారు.

మూడవరోజు 20/05/2026 రోజున ఉదయం నుండి ప్రతిరోజు పద్యరచనలో మెళకువలు నేర్చుకునేవారికి ప్రత్యేక శిక్షణ ఒక విభాగంగా, అవధాన ఛాత్రులకు అవధాన శిక్షణ మరొకవిభాగంగా తరగతులు జరిగాయి. శ్రీ నారాయణం బాలసుబ్రహ్మణ్యం గారు పద్యరచనా విభాగ ప్రధానాచార్యులుగా వ్యవహరించగా పూర్వ శిబిరాల ఛాత్రావధానులు బోరెల్లి హర్ష గారు, గట్టెడి విశ్వంత్ గారు, ఎర్రంశెట్టి ఉమామహేశ్వర్ రావుగారు పద్య రచనలో శిక్షణాచార్యులుగా అనేక అంశములను ప్రతిరోజు తెలియజేశారు. అవధాన శిక్షకులకు ముందుగా మొదటిరోజు దోర్బల ప్రభాకరశర్మగారు సంస్కృతంలో పురాణ పఠన తరగతి నిర్వహించిన అనంతరం 'భాష వ్యాకరణాంశాల' గురించి ప్రముఖ భాషావేత్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి గారు తెలుగు సంధుల గురించి పద్య ప్రయోగాల గురించి అనేక అంశాలను తెలియజేశారు. మధ్యాహ్నం ఆముదాల మురళి గారు అవధానంలోని సమస్యాంశాల పైగురించి పాఠంచెప్పారు. అనంతరం డా.మండపాక మహేశ్వరి గారు (విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త) అష్టావధానం చేశారు. తమ ప్రతిభాయుత అవధానంతో పలువురి ప్రశంసలనందుకున్నారు.

నాలుగవ రోజు (గురువారం) 21.5.2026 ఉదయం 6 గంటలకు దోర్బల ప్రభాకరశర్మ గారు సంస్కృతపాఠం చెప్పారు. శ్రీమాన్ చక్రవర్తి గారు భాష వ్యాకరణంలో సంధులు సమాసముల గురించి తెలియజేసారు. తర్వాత చిటితోటి విజయ కుమార్ గారు అవధానంలో వార గణనం గురించి చక్కని పాఠం చెప్పారు. అనంతరం శ్రీ నారాయణం బాలసుబ్రమణ్యం గారు యాంత్రిక గణితం గురించి తెలియజేసారు .

ఆ తర్వాత శ్రీ చిటితోటి విజయకుమార్ గారు విశేష యతుల గురించి అనేక ఉదాహరణలతో పాఠ్యాంశాన్ని నిర్వహించారు. అదేరోజు భోజనాల అనంతరం శ్రీ ఆముదాల మురళి గారు అవధానంలోని నిషిద్ధాక్షరి అంశంలో అనేక మెళకువలు తెలియజేశారు. అనంతరం శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ గారు అవధానులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం గురించి చక్కగా తెలియజేశారు. ఆ తరువాత అచ్చ తెలుగులో శతావధానం చేసినటువంటి డా.జంధ్యాల సుబ్బలక్ష్మి గారు అవధానంలో అచ్చ తెలుగు పద ప్రయోగం గురించి అనేక అంశాలు వివరించారు. అనంతరం శ్రీ గట్టెడి విశ్వంత్ గారు (పూర్వఛాత్రావధాని) అష్టావధానం అద్భుతంగా పూర్తి చేసి అందరి మెప్పులను పొందాడు.

5వ రోజు (శుక్రవారం) 22 .5 .2026 ఉదయం దోర్బల ప్రభాకర శర్మ గారి సంస్కృతాధ్యయనం పురాణ పఠనం అనంతరం శ్రీ మావుడూరి సూర్యనారాయణ మూర్తి గారు అప్రస్తుత ప్రసంగం గురించి అనేక ఉపయుక్త విషయాలు తెలియజేశారు. అనంతరం శ్రీ ఆముదాల మురళి గారు భావి అవధానులకు ఉపయుక్తమైనటువంటి అనేక నిఘంటువుల

వినియోగంపై విలువైన సూచనలతో పాఠం చెప్పారు. తర్వాత అవధానంలో పురాణ పఠనం గురించి శ్రీ అన్నమరాజు ప్రభాకర రావు అనేక కావ్యేతిహాసాల పద్యాలను ఉదాహరణలతో వివరించారు. భోజనానంతరం దేశి ఛందస్సు గురించి డా.సంగన భట్ల నరసయ్య గారు ప్రసంగిస్తూ మార్గ దేశి పద్ధతుల గురించి పాఠంచెప్పారు. ఎన్నో ఉదాహరణలు తెలియజేశారు. అనంతరం చిత్రకవి సమ్రాట్ శ్రీ చింతా రామకృష్ణారావుగారు అవధానంలో 'గర్భ కవిత్వం బంధకవిత్వం' గురించి తెలియజేస్తూ ఉదాహరణలతో వివరించారు. సాయంకాలం వేళ బృహద్ద్విసహస్రావధాని డా.మాడుగుల నాగఫణి శర్మ గారు తమ అమూల్య ప్రవచనామృతమునందించి అవధాన విద్యావికాస పరిషత్ వారిని వారి సేవలను కొనియాడారు .

అనంతరం ఈ ఐదవ శిబిరం నుండిఆవిర్భవించిన శ్రీ బైరపనేని పోతురాజు చౌదరి గారు అష్టావధానం చక్కగా చేశారు.

ఆరవ రోజు (శనివారం) 23.5.2026 డా.దోర్బల ప్రభాకర శర్మ గారి సంస్కృత పురాణ పాఠం అనంతరం శ్రీ ఆముదాల మురళి గారు అవధానంలో వర్ణన, ఆశువు అంశాల గురించి అనేక అంశాలు పాఠంగా తెలియజేశారు. అవధానములో గుర్తుంచుకోవలసినటువంటి ఎన్నో విషయాలను తెలియజేశారు. ముఖ్యమైన పదాల గురించి వివరించారు. అనంతరం శ్రీ చిటితోటి విజయ్ కుమార్ గారు అవధానంలో వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి గురించి చాలా విషయాలను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. అనంతరం ఈ సంస్థకు అవధాన విద్యా వికాస పరిషత్ అను నామకరణం చేసినటువంటి శతావధాన పంచానన డా. జీ ఎం రామశర్మ శతావధానిగారు అవధానంలోని ధార ధారణ గురించి అనేక విశేషాలు తెలియజేశారు. సాయంత్రం పద్యకోకిల డా. బోచ్కర్ ఓం ప్రకాశ్ గారు తిరుపతి వేంకట కవుల పద్య వైభవం గురించి సాధికారంగా ప్రసంగం చేశారు. అనంతరం అవివిప పూర్వ ఛాత్రావధాని చి. వింజమూరి సంకీర్త్య శర్మ అష్టావధానాన్ని చక్కగా పూర్తి చేశారు.

ఏడవ రోజు (ఆదివారం) 24/ 5/2026 ఉదయం డా.దోర్బల ప్రభాకర శర్మ పురాణ పఠన తరగతి ముగిసిన తరువాత శ్రీ ఆముదాల మురళి గారు అవధానంలో దత్తపదుల గురించి సోదాహరణ పాఠం అందించారు ,అనంతరం అవధానంలోనూ, తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటడంలో విశేష కృషి చేస్తున్న ప్రముఖులను అవధాన విద్యా వికాస పరిషత్ గౌరవపురస్కారాలతో గౌరవించింది. వారిలో తెలుగు భాషా వికాసోద్యమ సారథి శ్రీ జగర్లపూడి సీతారామకృష్ణ శర్మ (కర్నూల్) వారికి, సమస్య పృచ్ఛక చక్రవర్తి శ్రీ కంది శంకరయ్య (వరంగల్) వారికి ,చంద్రశాస్త్ర రత్నాకర, శ్రీ తోపెల్ల బాలసుబ్రమణ్యం (పగోజిల్లా) వారికి దేశి ఛందస్సులో విశేష కృషిచేస్తున్న సంగనభట్ల నరసయ్య గారికి అవధాన విద్యా వికాస పరిషత్ గౌరవ పురస్కారాలు అందజేశారు. డా.సంగనభట్ల గారిని 'దేశిచ్ఛందోంబుధి' అన్న బిరుదంతో గౌరవించారు. అనంతరం సమీక్షా సామ్రాజ్ఞిగా పేరుతెచ్చుకున్న శ్రీమతి మంచినీళ్ళ సరస్వతీ రామశర్మ గారి అష్టావధానం డా. బోచ్కర్ ఓంప్రకాశ్ గారి సంచాలకత్వంలో రమణీయంగా సాగింది. దీంతో ఈ ఐదవ శిబిరంలో ఆరు అష్టావధానాలు, ఒక స్వర్ణ (అర్ధ శతా)వధానం, ఒక శతావధానం జరిగిన ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది.

25/05/2026 (సోమవారం) రోజున త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ గారి సమక్షంలో ఉప్పలధడియం భరత్ శర్మ గారి ఏకదిన శతావధానం మరియు విద్యా వికాస పరిషత్ 5వ శిక్షణ శిబిరం సమాపనోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.

ఉదయం 7:00 గంటలకు ఏకదిన శతావధాన కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ పద్య అంత్యాక్షరితో శోభా యాత్ర గావించారు. అనంతరం ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన గావించిన తరువాత. వికాస పరిషత్ పూర్వ ఛాత్రావధాని యైన శ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ గారు దైవ ప్రార్థనతో ఏక దిన శతావధానమును ప్రారంభించారు. ముందుగా సమస్యలు, తరువాత దత్తపదులు ఆతర్వాత వర్ణన ఆశువు అంశాలని దీర్ఘ సమాసాలతో అద్భుతంగా పూర్తిచేసారు. అనంతరం స్వల్ప విరామము తరువాత నిరాటంకముగా ధారణ పూర్తిచేసి పలువురి ప్రశంసలనందుకున్నారు.అందరినీ అబ్బురపరిచారు. ఈ విధంగా శిక్షణ కార్యక్రమం ముగిసింది మరుమాముల దత్తాత్రేయ శర్మ గారూ ,మరుమాముల వెంకట రమణ శర్మ గారూ ఇంకా అనేక ప్రముఖుల నిర్విరామ కృషితో అవధాన సప్తాహం విజయవంతమైనది. ఈ కార్యక్రమం ఎందరో విద్యార్థులకు పద్య రచనలో మరియు అవధానంలో మెళకువలు నేర్పడమే కాకుండా ప్రతి రోజు రాత్రి సాధనావధానం శ్రీ ఆముదాల మరళి గారి సమక్షంలో జరిగింది. ప్రతి రోజు జరిగిన కార్యక్రమాలను, పాఠాలను మరుమాముల వెంకటరమణ శర్మగారి దర్శనమ్ యూట్యూబ్ ఛానెల్ లో ప్రత్యక్ష ప్రసారం చేయడం విశేషం.

మండువేసవిలో పన్నీటి జల్లులాగా హృద్యపద్యాలలతో మల్లినాథ అవధాన ప్రాంగణంలో ఎనిమిది రోజుల ఆనంద వృష్టి కురిసింది. ఇది తరతరాల మనవారసత్వవిద్యను భావితరాలకు అందించే గొప్ప ప్రయత్నంగా చరిత్రలో నిలిచి పోతుంది.

# పద్యపరిమళం

## నన్నయ భట్టారకుని అచ్చిక పదప్రయోగము

- అన్నమరాజు ప్రభాకరరావు

**తే.** గీ. మున్ను దన్నోటు వడి మఱి నన్ను నోటు
వడియెనో, నన్ను మున్నోటువడి విభుండు
గ్రన్న దన్నోటు వడియెనో, యన్న ! నాకు
నెఱుగ జెప్పుము దీని నీ వెఱుగుదేని (సభా 2 – 209)

“ముందుగా తనను తా నోడిపోయి పిమ్మట నన్ను పందెముగా నొడ్డినాడా, లేక ముందుగానే నన్నోడి ఆ తరువాత నా నాథుడు తనను తా నోడినాడా ? నీకు తెలిసినచో నాకెఱుకపరుపు మయ్యా” – ద్రౌపది తనను కౌరవసభ లోనికి తోడ్కొని పోవుటకు వచ్చిన ప్రాతికామితో పలికిన పలుకులివి.

మాయా దురోదరములో సమస్తైశ్వర్యము, రాజ్యవైభవాదులను తుదకు మహా బలసంపన్నులైన తమ్ములను కూడా పణముగా నొడ్డి యోడిపోయిన ధర్మజునితో శకుని **“ నీకు నొండు ధనము గలదు మఱచితెట్లు ? కమలాక్షి పాంచాలకన్య నీకు ధనము గాదె”** యని ప్రేరేపించెను. ధర్మజుడు **“అక్షరతుండయి ద్రౌపదిన్ మహోత్పలదళ చారునేత్ర, కులభామ”**ను పందెముగా నొడ్డి యామెను కూడా **“సౌబలు ఖలు చేత నోటువడి”** నాడు. అప్పుడు దుర్యోధనుడు తన యిలు తుడుచుటకు (దాసిగా) ద్రౌపదిని తోడ్కొని రమ్మని విదురునాదేశించగా నాతడు తిరస్కరించి బుద్ధులు సెప్పినాడు. విదురుని తూలనాడిన దుర్యోధను డీ పనికి ప్రాతికామిని నియోగించినాడు. ఆతడు సభలో జరిగిన వృత్తాంతమును సంక్షిప్తముగా ద్రౌపదికి తెలిపి తనతో కౌరవసభకు రావలసినదిగా – దుర్యోధను నాజ్ఞగా – విన్నవించగా నామె యాతనితో పలికినది పై పద్యము.

ప్రాతికామి యనగా ద్వారము నొద్ద వేచియుండు సేవకుడు. ఆతని శాస్త్రజ్ఞానము, భాషాజ్ఞానము, ఆలోచనా శక్తి పరిమితమైనవి. అంతటి విపత్కర పరిస్థితిలోను ద్రౌపది తన దైన్యస్థితిని, తానెవరితో మాటాడుచున్నదో వాని స్థితిని గుర్తెఱిగి, యుద్వేగావేశాదుల నదుపులో నుంచుకొని, యెక్కువ మాటలు లేకుండ విషయము తెలిసికొనగోరినది. ఈ పద్యము నందు శబ్దాడంబరము గాని, దీర్ఘ సంస్కృత సమాస బలము కాని లేవు. నాటక పద్ధతిలో సూటిగా నున్నది. ఈ పద్యములో నొక్క “విభుం”డను పదము తప్ప, తక్కిన వన్నియు నాచ్చిక పదములే. ఛందస్సు కూడా వృత్తము కాక “దేశీ”యము. అందునా “ఉపజాతి”కి చెందిన “తేటగీతి”.

ఇచ్చట పదప్రయోగము సాధారణముగా కన్పించుచున్నను ద్రౌపది యొక్క యసాధారణ ధర్మసూక్ష్మజ్ఞత, ఆత్మసంయమనము ద్యోతకమగుచున్నవి.

యజ్ఞసంభవయై, మహారాజపుత్రియై, మహావీరులైదుగురికి భార్యయై, యంతకు కొంత కాలము ముందే రాజసూయ మహాయాగములో పునీతయైన స్త్రీ ద్రౌపది. హఠాత్తుగా తాను ద్యూతవిజితనని తెలియగనే తనలోని యావేశోద్వేగక్రోధాలు (రౌద్ర రసము), సభలో నేమి జరుగునో యనెడు భయము (భయానక రసము), తన దైన్యము (కరుణ రసము) – ఈ విధముగా నేక కాలములో మూడు స్థాయిలు ముప్పిరిగొన్న మానసిక స్థితి ప్రకటనము కావలసిన సందర్భము. బహుశాస్త్ర పారీణత కలిగిన దీర్ఘ సంస్కృతసమాస భూయిష్టములైన పద్యము లొక కొన్ని రావలె. మహా కవులెవరైన నట్లే చేయుదురు. కానీ దార్శనికుడైన నన్నయ మహాకవులను మించినవాడు. ద్రౌపది యద్భుతమైన నిగ్రహశక్తి, స్థితప్రజ్ఞత కల మహిళ. ఈ విషయము మున్ముందు నిరూపితము కావలసియున్నది (అయినది). ద్రౌపది యొక్క “వ్యక్తి”ని నిలుపవలసిన ప్రణాళికాబద్ధమైన రచన ప్రారంభము నుండియే జరుగవలెను. ఇది నన్నయ మదిలో నున్నది. ఇచ్చట వాస్తవము తెలిసికొనవలసిన యవసరము ద్రౌపది కున్నది. తాను ధర్మవిజితయో, యధర్మ విజితయో తేలవలసి యున్నది. విశేషించి, వార్త వినిన తోడనే ద్రౌపదికి ధర్మజుడు తాను ముందోడినాడా, తనను (ద్రౌపదిని) ముందుగా నోడినాడా యను సందేహ మేల కలుగవలె? ధర్మజుడు “అక్షరతుడు”. జూదములో నుచితానుచితములు మఱచి పోవును. ధర్మాధర్మములు విచారింపని స్థాయిలో వివశుడగును. అదియును గాక, యోడుచున్న కొలదీ విజ్ఞత నశించును. అట్టి స్థితిలో ధర్మవిచారణము సేయక క్రమము దప్పి తనను పణముగా పెట్టినట్లైన నది యధర్మమగును. తన యోటమి చెల్లదు. ఈ విషయము తేలవలయునన్నచో నా వచ్చిన సేవకుని స్థిత మనస్కునిగా నుంచి సంపూర్ణ సమాచారమును పొందవలెను. అందువలన వాని మనస్సునకు పట్టు భాషలో, పునరుక్తి లేని పదప్రయోగముతో ద్రౌపది తన ప్రశ్నను సంధించినది. ఇదీ రచయిత ప్రజ్ఞ.

అట్లే, దీని ననుసరించి వచనము కూడా అచ్చికపద సంయుతమైనదే – “ఎఱుంగవేని యక్కితవు నడిగి వచ్చి మఱి నన్నుం దోడ్కొని పోనగునేని (మిగతా 23వ పేజీలో)

# వ్యాకరణ వరివస్య 10

## ఎన్.సిహెచ్. చక్రవర్తి

**ఉత్తునకచ్చుపరంబగునపుడు సంధియగు** (సంధి. సూ. 1)

తెలుగులో హ్రస్వమైన ఉకారానికి అచ్చు పరమైతే సంధి వస్తుంది. అని సూత్రానికి వివరణ.

**ఉకారం** అంటే హ్రస్వ దీర్ఘాలు రెండూ వస్తాయి.. **ఉత్తు** అంటే హ్రస్వ **ఉ** అని.

**రాముడు + అతడు = రాముడతడు.**

ఇక్కడ రాముడు అనే పూర్వపదంలో చివర ఉత్త్వం ఉంది. అతడు అనే పరపదంలో **అ** అనే అచ్చు ఉంది. సంధి సూత్రం ప్రకారం సంధి జరిగితే పరపదంలో ఉన్న **అ** ధ్వని నిలిచి **రాముడతడు** అనే రూపం ఏర్పడుతుంది.

ఇక్కడ మొదటి పదం చివర ఉన్న ఉత్త్వం లోపించింది కనుక దీనిని ఉత్త్వసంధిగా గుర్తించాలి.

పై ఉదాహరణ వలె

**సోముడు + ఇతడు = సోముడితడు**

**అతడు +ఎవడు = అతడెవడు**

**ఇతడు + ఒకడు = ఇతడొకడు**

మొదలైన సంధి రూపాలు ఏర్పడతాయి.

**ప్రథమేతర విభక్తి శత్రర్థచువర్ణంబులందున్న యుకారమునకు సంధి వైకల్పికముగానగు** (సంధి సూ. 2)

1వ సూత్రంలో ఉత్తునకు అచ్చు పరమైతే సంధి వస్తుంది అని చెప్పిన బాల వ్యాకర్త 2వ సూత్రంలో ఉకారానికి అచ్చు పరమైతే వచ్చే వికల్పసంధి చెప్పారు. సూత్రంలో ఉకారం అని చెప్పినా ఉదాహరణలు అన్నీ ఉత్త్వంతో చూపడం గమనార్హం. చూపిన ఉదాహరణలను బట్టి ఇది కూడా ఉత్త్వానికే వర్తిస్తుందని గ్రహించాలి.

ప్రథమావిభక్తి కాక మిగతా విభక్తులలో ఉన్న ఉకారానికి కానీ, వర్తమాన కాల క్రియల్లో **చు** అనే వర్ణానికి కానీ అచ్చు పరమైతే సంధి వికల్పంగా వస్తుంది.

ద్వితీయ విభక్తి **ను** వర్ణమే.

**తృతీయాదులకు నుగాగమంబగు** (తత్సమ 8) అనే సూత్రం వల్ల తృతీయ నుండి సప్తమి వరకు విభక్తులకు – **కయి, పట్టి, యొక్క** లకు తప్ప మిగతా విభక్తులకు – చివర ద్రుతం చేరుతుంది.

అందువలన **కొరకున్, వలనన్, అందున్** మున్నగు రూపాలు ఏర్పడతాయి.

**వచ్చుచున్, చూచుచున్** వంటివి శత్రర్థ చు వర్ణాలు.

వీటికి సంధులు వికల్పంగా జరుగుతాయి.

**నా కొరకున్+ ఇచ్చె** అన్నప్పుడు కొరకు లో చివర ఉన్న ఉత్త్వానికి సంధి జరిగి **నా కొరకిచ్చె** అనే రూపం ఏర్పడుతుంది. ఇది సంధి వస్తే ఏర్పడిన రూపం. వికల్పసంధి కనుక సంధి రాకపోతే కొరకు తరువాత ఉన్న న్ (ద్రుతం) తో అచ్చు కలిసి, **నాకొరకు నిచ్చె** అని అవుతుంది. ఇది సంధి రాని రూపం.. సంధి వస్తే మధ్యలో ద్రుతం మరుగున పడుతుంది. సంధి రానప్పుడు ద్రుతం(న్) ఉంటుంది. ఈ విధంగా రెండు రూపాలు ఏర్పడతాయి. ఈ రెండూ సాధు రూపాలే.

అలాగే...

**నా యందు(న్)+ఆశ** అని ఉండగా ఇక్కడ అందు అనేది సప్తమీ విభక్తి. చివర ఉత్త్వం ఉంది. (తృతీయాదులకు నుగాగమంబగు అనే సూత్రం చేత ద్రుతం వస్తుంది.)

ఇక్కడ సంధి జరిగితే **నా యందాశ** అనే రూపం సిద్ధిస్తుంది. వికల్పం వల్ల సంధి రాకుంటే ఆశలో ఆ ముందున్న ద్రుతంతో కలిసి **నాయందునాశ** అనే రూపం సిద్ధిస్తుంది.

ఇలాగే విభక్తుల ఉదాహరణలు గ్రహించాలి.

**వచ్చుచున్ + ఉండెను** అన్నచోట ముందు పదం చివర ఉన్నది శత్రర్థచువర్ణం. దానికి ఉండెనులో **ఉ** అనే అచ్చు పరమైంది. కనుక సంధి జరిగితే...**వచ్చుచుండెను** అనే రూపం సిద్ధిస్తుంది. వికల్పం కనుక సంధి రాకపోతే పైన వివరించినట్లు ద్రుతంతో కలిసి **వచ్చుచునుండెను** అనే రూపం సిద్ధిస్తుంది.

అలాగే **చూచుచున్ + ఏగెను** అని ఉండగా సంధి జరిగితే **చూచుచేగెను.** సంధి రాకుంటే **చూచుచునేగెను** అనే రెండు రూపాలు వస్తాయి.

అచ్చుల మధ్య ద్రుతం ఉన్నప్పుడు సంధి రాకపోతే ఆ ద్రుతం తోనే అచ్చు కలుస్తుంది తప్ప అలాంటిచోట్ల యడాగమం రాదు. ఇది గమనంలో ఉంచుకోవాలి.

కొందరు ఉత్త్వ సంధి నిత్యం అని చెప్తూ ఉంటారు. అలా చెప్పడం కూడదు. నిత్యసంధి అని సూరి గారు చెప్పదలిస్తే ఆ విషయం ఆయన సూత్రంలో చెప్పి ఉండేవారు. సూత్రంలో సూరిగారు నిత్యం అని చెప్పకపోవడం ఎందుకంటే ఇలాటి వికల్పసంధి ఆయన దృష్టిలో ఉండబట్టి.

అంతేకాక ముందుముందు **కరకుటమ్ము చిగురుటాకు** మొదలైన చోట్ల టుగాగమాదులు వస్తాయి..ఆకారణంగా కూడా ఉత్త్వసంధి నిత్యం అని చెప్పకపోయిఉండవచ్చు. **(సశేషం)**


# కవికల్పలత - 2

అవధాన ధారణాంశాలలో 'వర్ణన' కూడా ఒకటి. ఈ అంశాన్ని నిర్వహించడానికి అవధానికి అవసరమైన చాలా అంశాలు కవికల్పలతలో పొందుపరచబడ్డాయి.

వర్ణనీయ అంశాలు ఇచ్చినప్పుడు వాటిలోని సాధారణ అంశాలు, అసాధారణ అంశాలు అవధానికి తెలిసిఉండాలి. ఆయా అంశాలను స్పృశిస్తే కలిగే ఉదాత్తత, ఔచిత్యాన్ని గ్రహించి వర్ణించాలి. ఉదాహరణకు కవికల్పలత రాజుకు వర్ణించేటప్పుడు ఏయే అంశాలను స్పృశించాలి అన్నదానికి ఇలా చెబుతుంది...

నృపే కీర్తిః ప్రతాపాజ్ఞా దుష్టశాస్తి వివేకతాః ।
ధర్మ ప్రయాణ సంగ్రామ శస్త్రాభ్యాస శయక్షమాః ॥
ప్రజారాగోఽరి శైలాధివాసోఽరిపుర శూన్యతా ।
ఔదార్య ధైర్య గాంభీర్య శౌర్యైశ్వర్యోద్యమాదయః ॥

రాజు యొక్క కీర్తి, శాసనము, దుష్టశిక్షణ, ధర్మరక్షణ, ప్రయాణము, యుద్ధం, ధనుర్విద్యాభ్యాసం, నీతి, ఓర్పు, ప్రజానురాగం, శత్రు దుర్గములు ధ్వంసం, దాతృత్వం, ధైర్యం, గాంభీర్యం, శూరత్వం, ఐశ్వర్యం, ప్రయత్నం – మొదలగు వాటిని సందర్భోచితంగా అవధాని తన పద్యంలో చెప్పాలి. అదేవిధంగా రాజపత్ని, పురోహితుడు, మంత్రి, రాజకుమారుడు, సేనాపతి, దేశము, గ్రామం, రాజధాని, సరస్సు, సముద్రం, నది, ఉద్యానవనం, శైలం, ఆశ్రమం, మంత్రాంగం, దౌత్యం, యుద్ధం, ప్రయాణం, వేట, అశ్వ, గజ వర్ణనములందు పేర్కొనవలసిన అంశాలను స్పష్టపరుస్తుంది కవికల్పలత.




ముఖ్యంగా ఋతువర్ణనలకు సంబంధించిన అంశాలను గూర్చి చెబుతూ వసంతంలో ఉయ్యెలలు, కోకిలలు, మలయమారుతం, సూర్యగమనం, చెట్లు చిగుర్చుట, మామిడిపూలగుత్తులు తుమ్మెదల రొదలు, జాజులు దక్క మిగిలిన పుష్పములను గూర్చి ప్రస్తావించాలని, గ్రీష్మంలో మల్లెలు, పాటలపుష్పాలు, ఎండవేడిమి, శోషిస్తున్న జలాశయాలు, పథికుల బాధలు, గాలిదుమారాలు. అగ్నిప్రమాదాలు, చలివేంద్రాలు, ఎండమావులు, మామిడిపండ్లు మొదలగునవి, వర్ష ఋతువులో మేఘాలు, నెమళ్లు, హంసలు మానససరోవరానికి వెళ్లుట, బురద, క్రొత్తమొలకలు, జాజిపూలు, మొగిలిపూలు, కడిమిచెట్లు, గాలివానలు, నదులు పొంగుట. కర్షకుల సంతోషము మొదలగు విషయాలను వర్ణించాలని కవికల్పలత నిర్దేశిస్తుంది. అవధాని ఈ విషయాలలో కవిసమయాలను కూడా జోడించుకొని వర్ణనలో ఔచిత్యాన్ని పాటించాలి.

మిగిలిన ఋతువులతో పాటు సూర్యోదయ, సూర్యాస్తమయ, చంద్రోదయ, వివాహ, విరహ, స్వయంవర, సురాపాన, పుష్పాపచయ, జలక్రీడ, సురత మొదలగు వర్ణనలను గూర్చికూడా చెప్పబడియున్నది. అటుపై కవిసమయాలను మూడు విధములుగా విభజించి తెలియచేస్తుంది. (వీటికి సంబంధించిన విస్తృత వివరాలకొరకు దర్శనం టి.వి.లో ఈ వ్యాస రచయిత గారి పాఠాలను వినవచ్చును).

దేవేశ్వరకవి తన కవికల్పలత యందు వర్ణకుసుమములో శ్వేతవస్తువులు, కృష్ణవస్తువులు, పాలానవస్తువులు, ఎఱుపువస్తువులు, పీతవర్ణవస్తువులు, ధూసరవస్తువులు మొదలగు వాటిని పేర్కొన్నారు. ఉదాహరణకు అంగారకుడు, సూర్యుడు, రాగి, కుంకుమ, తక్షకుడు, గురివెంద, ఆరుద్రపురుగు, మిణుగురుపురుగు, మెరుపు, నెత్తురు, కోడిజుట్టు, మాణిక్యం, చిలుకముక్కు, చకోరపక్షి, కోయిలకన్ను, అగ్గి, అశోకపుష్పం, పద్మం, దానిమ్మపువ్వు, చిగురు, నఖక్షతం, క్షత్రియుని పరాక్రమం, రౌద్రరసం మొదలుగునవి ఎరుపురంగు కలవి. వీటికి ఉపమానములు కూడా దేవేశ్వరకవి పేర్కొన్నారు

అటుపై భుజము, కొప్పు, చక్రవాకము, లావుకపిట్ట, గజకుంభము, ఎద్దు మూపురము, ఎక్కుబెట్టిన విల్లు మొదలగునవి వృత్తవస్తువులని, నాగలి, శివుని మూడవకన్ను, యోని, వజ్రాయుధము మొదలగునవి త్రికోణరూపములని, ముంగురులు, నుదురు, కనుబొమలు, నఖక్షతములు, కొడవలి, క్రీగంటి చూపు, పాము పడగ మొదలగు వాని వక్రత్వము వర్ణించవలెనని, సజ్జనుల మనస్సు, స్త్రీల నితంబము, తలుపు, కుచము, బుద్ధి వీటికి గురుత్వము (గొప్పదనము) చెప్పవలెనని, అంతేగాక సుఖకరమైనవి, దుఃఖకరములు, స్థిరములు, అస్థిరములు, మందగాములు, క్రూరములు, బలిష్ఠములు, రూపవంతులు, ఉష్ణములు, మధురములు – ఈ లక్షణాలు వేటియందు చెప్పవలెనో దేవేశ్వరకవి కవికల్పలతయందు స్పష్టపరిచి యున్నారు. నాయకునియందు ఆరోపించవలసిన ఔదార్య ధైర్య గాంభీర్య సౌందర్య శౌర్యాది గుణములను పేర్కొన్నారు.

(మిగతా 22వ పేజీలో)

### ప్రతిమాసం వాణీదరహాసం
### సాహిత్య సాంస్కృతిక సంస్థ, పొన్నూరు నిర్వహణలో
## విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి గారి అష్టావధానం

**14. 06. 2026**

**నిషిద్ధాక్షరి: పాతూరి సుబ్రహ్మణ్య కవి**

శ్రీకళలన్భూషింప జ
గా కారణములనిదౌఘ కాలంబై యా
శ్రీ కైవల్యముగూర్పగ
శ్రీ కారముజుట్టైతాను శ్రీ గురుడతడై

**సమస్య: నాగలింగం హరిహర పంత్**

**భండనమందురాఘవుడు పార్థుని జంపెనదేమి చోద్యమో .!**

చండశిలీముఖంబులను శాత్రవు జంపగ  పంపె జూడగా
మండితశౌర్యతేజముల మాధవు దేర్పడజేసె నాజిలో,
దండుగ జేరి బాలుడని దాడిని జేయుచు యుద్ధభూమిలో
భండనమందు రాఘవుడు, పార్థుని, జంపెనదేమిచోద్యమో

**దత్తపది: దుర్భా కౌండిన్యసాయి**

**పద్యము, గద్యము, హృద్యము, మద్యము - పదాలతో తెలుగువైభవం గుఱించి స్వేచ్ఛా ఛందంలో**

తెలుగే హృద్యము పద్యగద్యముల దివ్యాత్మై విభూషింపగా
సులువౌ కేళుల సాహితీ క్రియల సంస్తోత్రమ్మునున్ జెందగా
తెలుగే దివ్యకవిత్వతత్త్వముల దేదేప్యంబునౌ జూడగా
కలరౌ మద్యముగా దలంచు ఘనులే కావ్యంబులన్ నేర్చుచున్




**వర్ణన: బయ్యా ఉదయ భాస్కరరావు**

**వర్షము - రైతులు  చంపకమాలలో**

చ.	పులకిత ధాత్రి హర్షమును పొందు జలమ్ము వరమ్ములీయగా
చలనము జెందు సైరికులు సాగగ క్షేత్ర సుసేద్యపాలనన్
కలిత సుసస్య శోభలనుగాంచుచు తృప్తినిజెందు నిచ్చలున్
జలకళ జేరి లోకమున శ్రాంతులనీయ ఫలింప వాంఛలే

**న్యస్తాక్షరి: పరాశరం శేషు కుమారి**

**1-8-భా, 2-10-వ, 3-6-దే, 4-17-వ**

**హనుమత్ ప్రతాపము శార్దూలంలో**

భీముండై కపినాథుభాసములచే భీభత్సమున్ జేసెగా
నీమంబున్విడనాడి సాగువనితా నిర్బంధ దైత్యాళికిన్
కామంబంది పదేపదే ధరణిజన్ కాఠిన్యమున్జూపగా
ధీమంతంబునుజూపితాను నడచెన్తేజంబులే వర్ధిలన్

**ఛందోభాషణం: రాయప్రోలు జగదీశచంద్ర శర్మ**

**అప్రస్తుత ప్రసంగం: రామరాజు కేశవరావు**



## ఆకాశవాణి 90 సంవత్సరాల ప్రజాసేవా వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ కేంద్రం నిర్వహించిన 'గగనవిజయం' కార్యక్రమం సందర్భంగా -

# నల్లాన్ చక్రవర్తుల సాహిత్ గారి అష్టావధానం

**ముఖ్యఅతిథి:** డా. కె.వి. రమణాచార్యులు **07.06.2026**

**విశిష్ట అతిథి:** డా. ఏనుగు నరసింహారెడ్డి

**సంచాలకులు:** మరుమాముల దత్తాత్రేయ శర్మ

**నిషిద్ధాక్షరి:** డా. జి.యం.రామశర్మ

ప్రసారంగా ఆకాశవాణి విశేష కృషి

కం. రసవత్ ఖచలత్ ప్రాగ్వా
గ్దిశలన్ మ్రోయన్, వరప్రతిష్ఠన్ నిల్చున్
రసనము సత్యము పలుకుటె
శ్వసనముగాగల్గు గగనవాణివెలుంగున్!!

**సమస్య:** కంది శంకరయ్య

**ఆకాశవాణి నిరంతరమ్మును కల్లలే పలుకున్ గదా!**

దేశమందున వార్తలన్ గడు తీపి మాటల జెప్పుచున్
లేశమైనను తప్పులుండని రేడియోలను వీడి, టీ
వీ సభాస్థలిఁ గల్లలన్ గని వేడు నెంచకయుండునా
**కాశవాణి, నిరంతరమ్మును కల్లలే పలుకున్ గదా!**

**దత్తపది:** అవుసుల భానుప్రకాశ్

రామ, రామ, రామ, రామ పదములతో గగనవాణి విభవము స్వేచ్ఛావృత్తంలో

శా. ఆకాశంబున రామణీయకముగా నందంబుగా నాడుచున్
సోకుల్ జిందెడి యా విరామములకున్ చోటెంతయున్ మానుచున్
చీకాకుండని సుస్వరామలతతో శ్రేష్ఠంబుగా నున్న యీ
యాకాశోజ్జ్వల వాణి వెల్గును ప్రసారానీక సుత్రామతన్!!

**వర్ణన:** డా. మండపాక మహేశ్వరి

బాసరసరస్వతిని స్వేచ్ఛావృత్తంలో

ఉ. వీణియ చేతబట్టి, కనువిందగు చెన్నగవున్ ఘటించి, జాం
బూనద నాసికాభరణ భూషితయై, కరుణార్ద్ర నేత్రయై
దీనత బాపుచున్ మృగమదీ తిలకంబును గల్గు బాసరా
వాణిని గౌతమీ విమల వాహతటంబున రాణి గొల్చెదన్!!

**న్యస్తాక్షరి:** ఆరవల్లి శ్రీదేవి

**1-4-సు, 2-8-ఖీ, 3-10-భ, 4-11-వ** అక్షరాలు వచ్చేలా 'సర్వేజనా సుఖినో భవంతు' శార్దూలంలో

శా. అన్నాదుల్ సులభంబుగా గలిగి వస్త్రాదుల్ సమృద్ధంబుగా
కన్నుల్ నిండగునా సుఖీనముగ సౌకర్యమ్ముగన్ నిద్రయున్
కన్నెల్ రక్షణనొందుచున్ శుభముగా గ్రాలంగ మార్గాళిలో
యిన్నేలన్ రఘురామరాజ్య సువరమ్మొందున్ విరాజిల్లదే!!

**ఆశువు:** శ్రీచిటితోటి విజయకుమార్

1. పల్లెలుపట్టుగొమ్మలుగా నిసర్గ సౌందర్యాన్ని చెప్పాలి

ఉ. చల్లని గాలులా? యెదకు చక్కని పద్యములందజేయు, మేల్
జల్లుల వానలా? ధరణి సార సుగంధములందజేయు, నా
పిల్లన గ్రోవులా? నెమలి పింఛము గల్గిన వానిచూపు, నా
పల్లెలసుందరత్వమును పల్కగ నెంతటి వాడనో కవీ!!

**2. 'జయత్యాకాశవాణీయం దివ్య వాణీ ప్రసారిణీ' భావంతో**

తే.గీ. నూరు వత్సరమ్ములు రసమూరునట్లు
పేరు గొన్న ప్రసారాల మేరు శిఖరి
రమ్యమై విలసిల్లుత రయము నయము
జయమె! ఆకాశవాణికి జయము! జయము!

**అప్రస్తుత ప్రసంగము:** రంగి సత్యనారాయణ



# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

"రావణాసురుడే జపించెను రామనామము భక్తితో"

**కవుతా రామకృష్ణ**

కావరమ్మున నంధుడై దశకంఠు డెగ్గులుసేయగన్
ఠీవిగా రఘురామునెంచుచు డెందమందుఁ గపీశుడున్ ,
దేవశాత్రవగోష్ఠిమధ్యను దేఱిపాఱ గనంగ నా
రావణాసురుడే- జపించెను రామనామము భక్తితో.

**కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు**

ఆ వనంబు లయంబు జేసి మహాస్త్రమంత్ర వశంబునన్
ధీవరుండగు వానరేంద్రు దధీనుడై జని కొల్వునన్
పావనంబుగ నాలపించగ భవ్య గానము జూడగా
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో

**ప్రబల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉండవల్లి సెంటరు**

కావరమ్మున విఱ్ఱవీగిన కాశ్యపేయుడు, వాలిచే
చావు దెబ్బలు తిన్న భీరుడు, జానకీపతి వైరియున్
రావణాసురుడే; జపించెను రామనామము భక్తితో
సేవకుండగు వాయుసూనుడు చిత్తమందున సర్వదా.

**రాకుమార, గోదావరిఖని**

భావికంబగు భావనంబును పారమార్థికమొప్పు సం
జీవనౌషధమై తరింపను జేయు నీశుని మంత్రమున్
రావణాసురుడే జపించెను, రామనామము భక్తితో
భావనంబున నిల్పె మారుతి పండితాళియు మెచ్చగన్.

**శ్రీనివాస్ లింగం, దుబాయ్**

త్రోవ తప్పిన రాయడెవ్వడు? దుష్టుడెవ్వడు లంకలో?
ఆవులించక యేమి చేసెనొ యాంజనేయుడు సేనతో
తా వనంబునకేగు వేళను ధార్మికమ్ముగ నుండియున్?
రావణాసురుడే, జపించెను రామనామము భక్తితో!

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

కావరమ్మున కారుకూతల కాంచి మౌనుల శాపమున్
పావనమ్మగు విష్ణు లోకపు స్వామ్యమున్ విడి యాతుడై
దేవదేవుడు మర్త్యుడై కడ తేర్చగా తన కోలతో
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

దేవదేవుడు శౌరి రాముని దేవి లక్ష్మిని జానకిన్
త్రోవ వేడక లంక దెచ్చితె! మోహమందున నేమమే?
త్రోవఁ దప్పకుమన్న యాలియె తొంగినంతట స్వప్నమై
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో!

**పి.ఎల్. నాగేశ్వర రావు, హైదరాబాదు**

చేవగల్గిన వాయుపుత్రుడుఁ జెంత నిల్చుచుఁ గొల్వులో
భావి కల్పన జేసి యచ్చటఁ బాడ రాముని నామమే
సేవగించక దైత్యులెల్లరు హేలగా వడిఁ బాడగా
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో!

**ఆకుల శాంతిభూషణ్, వనపర్తి**

దేవదేవు దయోధ్య రాముడు దివ్యబాణము వేయగన్
శైవభక్తుడు దానవేంద్రుడు చావుముంగిట నిల్వగన్
త్రోవ జూపుచు మోక్షమందగ బ్రోవుమంచును వేడుచున్
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

పావనమ్మగు భూమిజాతకు పాదపద్మము మ్రొక్కుచున్
కావుమంచును కేలుమోడ్చుచు కాననమ్మున కేగగా
భావనమ్మున రాము దల్చుచు ప్రావు గోరుచు స్వప్నమున్
రావణాసురుడే జపించెను రామనామము భక్తితో!

**వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు**

కావరమ్మున సీతదెచ్చియు కాన దాచిన వానికిన్
చేవగా హితబోధవేళల చెంత రాముని నామమే
భూవరుల్ కొనియాడ పల్మరు భూషయై మది మ్రోగగా
రావణాసురు డేజపించెను రామనామము భక్తితో.

**ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి, హైదరాబాద్**

పావనుండగు నాంజనేయుడు భావి బ్రహ్మ ప్రియంబుగా
భావనా పరమైన కల్పన వ్రాసెనందున ధాత్రిపై
రావణాసురుడే జపించెను రామ నామము భక్తితో!
జీవ నాడికి శాంతమప్పుడె చేరునే గద! సత్యమున్.

**సమస్య:** 'బావా రమ్మని పిల్చె స్నేహ మెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్'

**దత్తపది:** 'గో - రన్ - కమ్ - వాక్' పదాలతో 'పల్లె సౌందర్యాన్ని' వర్ణిస్తూ ఉత్పలమాలలో పద్యం

(పూరణలు 16 జులై 2026 లోపు 7702121376 ఫోన్ నంబరుకు పంపాలి)

## దత్తపది

'కదన-వదన- రదన-సదన' పదాలతో శ్రీరాముని స్తుతిస్తూ, కందపద్యం.

**వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు**

వదనము కరుణాసదనము
పదపడి కదనమ్ము సేయ పరుగిడు వైరుల్
రదనములో స్మిత కాంతులు
పదముల దయ జూపు రామభద్రుని కొలుతున్.

**ఆకుల శాంతిభూషణ్, వనపర్తి**

సురుచిర నిర్మల వదనా!
వరమగు కుంద రదన! రిపు భంజన కదనా!
సురవైరి నిచయ దమనా!
పరమదయా సదన! రామ! భవ భయ హరణా!

**కవుతా రామకృష్ణ**

సీతాహృదయాబ్జసదన!
సీతావదనవనజాతజిష్ణు! రఘువరా!
వాతాత్మజవరద! నతిని
బ్రీతిన్ గొనుమయ్య కదనభీమా! రామా!

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

కదనంబందున సుగ్రుడు
వదనసరోరుహమదెంత వన్నెల చిందన్
రదనమనోజ్ఞవిశాలత
సదన ఘనవిరాజిత సుఖ సారమ్మతడే!

**కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు**

కదనమున గెలిచి విహసిత
వదనముతో సీత గూడి భాసురముగ నీ
రదదేహా! రామా! లె
స్సదనము నేలుము మము వర సాకేత విభో!

**తూములూరు శేషయ్య శాస్త్రి, హైదరాబాదు**

కదనము కాగా, బ్రతుకులు,
వదనము లెండెను ముదిమిని వందన మయ్యా,
రదనము లూడెను పలుకగ,
సదనము నాహృది నిలువుము సాకేతవిభూ!

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

కదన విజేతగ, జానకి
వదనమునకు ముదము నిడిన పావన రామా!
సదనమున కడుగిడంగ సు
రదనలు కొనియాడు రామ! రావే కావన్.

**శ్రీనివాస్ లింగం, దుబాయ్**

కదనమున వీరుడవు, నీ
వదనము సుందరము! చూడ బహు చక్కనివౌ
రదనములు! భక్తుల హృదయ
సదనములందు నివసించు జానకిరామా!

## తటిల్లతలు

### అష్టకాల నరసింహరామ శర్మగారి అవధానాలలో అప్రస్తుత పద్యాలు

**ఈ హసంతిని ఎండవేళల ఏలవాడెదు చెప్పుమా?**
ఈహ గల్గెడు నోర్చుకొంటకు నేమి చేయుదు మిత్రమా!
**ఈహ గల్గిన నే హసంతిననేని వాడుట ధర్మమా?**
మోహముండిన వాని బుద్ధిని మూఢబుద్ధిగ నెంచుమా

**మీసము లాడువారలను మోమొకచోటను జూచియుంటి మా**
**మీసములున్న తీరు నిట మేలిమి వర్ణన జేసి చెప్పుడీ!**
వేసము వేసికొంచు మరి వేదిక లెక్కుచు దందనాలతో
భాసిలు వారి జూచితిరొ బాస యొనర్చియు జెప్పుడియ్యెడన్

**మామిడిపలి సాంబార్యుని**
**నేమని వర్ణింతురొక్కొ యింపుగ జెపుడీ**
మా మిడి మిడి తలపులతో
నేమని వర్ణించ గలుగు దీశ్వరసమునిన్

**పేలుందు నేమి తలలో**
**వేలుపు వనితలకు?** వినుము వేలుపులందున్
పేలుండిన దలదిరుగుట
లీలగ బ్రశ్నింతు రెట్టులిది యని సఖుడా!

కొబ్బరికాయలే గుడిని గొట్టెద రేటికి దేవళమ్ములన్?
కొబ్బరికాయ గొట్టి యొక కోటి ధనమ్మును గోరు నీలిమా
యబ్బలనాటి నుండి సహజాతిశయంబుగ వచ్చె, గాక, తా
లిబ్బుల గోరి నాతలను లీలగ బాదిన దెబ్బకోర్తునే?

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

## గూఢార్థం

వామనుడు ప్రతిపాదించిన అర్థదోషాలలో గూఢార్థం ఒకటి. 'అప్రసిద్ధార్థప్రయుక్తం గూఢార్థమ్' అని వామనుడు చెప్పిన నిర్వచనం. చాలా పదాలకు నిఘంటువులలో చాలా అర్థాలుంటాయి. అయితే వినియోగదశలో ఆ పదాన్ని ఏదో ఒక అర్థంకోసమే వాడటం కవిలోకసిద్ధమై వుంటుంది. అది ప్రసిద్ధమై ఉంటుంది. అప్పుడా పదాన్ని ఆ అర్థంలోనే వాడాలి ఇతరులు కూడా. నిఘంటువులలో వుంది గదా అని అప్రసిద్ధమైన ఆ అర్థంలో వాడి, ప్రశ్నించినవారికి నిఘంటుప్రమాణాన్ని చూపిస్తే చెల్లదని వామనుడి అభిప్రాయం.

ఉదా –

**అల సహస్రగుసేన నా యరుల కోర్వ**
**రాదుపో నీదు సేన భూరమణవర్య**

ఇక్కడ **'సహస్రగు'** అన్న సమస్తపదంలోని గు(గో)శబ్దం గూఢార్థం. వివరంగా చూద్దాం. 'గో'శబ్దమే 'గు' గా మారింది సహస్రగు పదంలో. 'సహస్రాణి గావః యస్య సః' అన్న లౌకికవిగ్రహంలో సహస్రగో పదం 'గోస్త్రియోరుపసర్జనస్య' అన్న సూత్రంతో 'గు'గా మారింది. సహస్రగు (సహస్రగువు) అయింది. ఇక్కడ గోశబ్దం నానార్థకం "గౌర్నాకే వృషభే చంద్రే వాగ్భూదిగ్ధేనుషు స్త్రియామ్। ద్వయోస్తు రశ్మిదృగ్బాణస్వర్గవజ్రాంబులోమసు ॥" అని అభిధానకోశం. గో శబ్దం వృషభార్థంతో పాటు ఇంకా చాలా అర్థాలనిస్తుంది. చంద్రుడు, వాక్కు, భూమి, దిక్కు, ధేనువు (స్త్రీ లింగమైతే), కిరణం, కన్ను వగైరా. ఆ గోపదం వృషభార్థం లోనే ప్రసిద్ధం, కిరణార్థంలో కూడా. అయితే కన్ను అనే అర్థంలో దానికి ప్రసిద్ధిలేదు. 'సహస్రగు' పదం వేయికన్నులు గల ఇంద్రుడు అనే అర్థంలో గో శబ్దానికి నయనార్థాన్ని స్వీకరించింది. అది అప్రసిద్ధం. కాబట్టి గూఢార్థం పేరుతో అది దోషం.




కావ్యాలంకార సంగ్రహంలో రామరాజభూషణుడు

**కృతి నఖ్యాతము గూఢం**
**(బతిశయరూఢివ్యపేత మన్యార్థంబై**
**క్షితిఁదగు) శోణిత నయనుం**
**డితఁ (డనఁగ సమానుఁ డితఁ డహిధ్వజుఁడనఁగన్)**
(4–12)

కావ్యంలో అఖ్యాతము = అప్రసిద్ధం గూఢం. "ఇతడు శోణితనయనుఁడు" అన్న ప్రయోగంలో శోణిత పదం గూఢార్థం. శోణిత పదానికి నెత్తురు అన్నది ప్రసిద్ధార్థం. కుంకుమం / కుంకుమవర్ణం అని కూడా అర్థముంటుంది కానీ సమస్తపదంలో శోణితశబ్దం విశేషణంగా కుంకుమవన్నెగల / ఎఱ్ఱని అనే అర్థంలో ప్రయోగించబడింది. కానీ అది అప్రసిద్ధం. అందుకే గూఢార్థమనే దోషమక్కడ.

కావ్యాలంకారచూడామణిలో విన్నకోట పెద్దన ఈ దోషాన్ని క్లిష్టగూఢార్థం అన్నాడు. ఇది ఒకటే.. రెండు కాదు. అలా ఎందుకు అనవలసి వచ్చిందో తానే వివరిస్తాడు – చూడండి

**క్షతజ కంజేక్షణలు క్షామగల్లకటులు**
**ఘనవిదగ్ధాత్మికలుఁ బురికాంతలనఁగఁ**
**గ్లిష్టగూఢార్థమనఁ జనుఁ గ్లేశసరణిఁ**
**దత్తదర్థంబు నెఱిఁగెడి తలఁపు చేత** (6/84)

కష్టపడి ఆయా అర్థాలను తెలిసికొనవలసి వస్తుంది కనుక అది క్లిష్టగూఢార్థమని పెద్దన అభిప్రాయం. "క్షతజ కంజేక్షణలు" అన్న సమస్తపదంలో 'క్షతజ' శబ్దం "క్షామగల్లకటులు" పదంలో 'క్షామ' శబ్దం, "ఘనవిదగ్ధాత్మికలు" పదంలో ఘనశబ్దం క్లిష్టగూఢార్థదోషజుష్టాలు. క్షతజం అంటే నెత్తురు. కంజేక్షణలు – కంజ (పద్మం) వంటి కన్నులు గలవారు.. నెత్తురువంటి కంజేక్షణలు కుదరదు. నెత్తురోడెడి కంజేక్షణలు కుదరదు. అసలు అక్కడ కవివివక్షిత భావం 'వారి కన్నులు ఎఱ్రతామరలవంటి'వని చెప్పటం. అంటే క్షతజ పదాన్ని ఎఱ్రని(శోణిత) అర్థంలో వాడాడు కవి. అదెలా సిద్ధిస్తుందంటే ఇలా – క్షతజం > నెత్తురు; నెత్తురు > ఎఱ్రదనం; క్షతజం > ఎఱ్రదనం. ఈ విధంగా అర్థాన్ని లాగగలగటం క్లిష్టం – కాబట్టి ఇది క్లిష్టగూఢార్థం. అయితే వామనుడు ఇటువంటి అర్థకల్పనను నేయార్థ మన్నాడు. ఇటువంటిదే క్షామగల్లకటులలో క్షామ పదం. క్షామమంటే కరువు. తత్కారణంగా జరిగే ఫలం కార్శ్యం (చిక్కిపోవటం). కాబట్టి క్షామమైన గల్లం, కటి గలవారు అని కార్శ్యార్థంలో కారణపదాన్ని ప్రయోగించాడు కవి. గూఢార్థమే కదా! 'ఘనవిదగ్ధాత్మికలు' పదంలో అయితే ఘనశబ్దం, విదగ్ధశబ్దం (ప్రధానంగా) అప్రసిద్ధార్థప్రయుక్తాలై గూఢార్థాలు అవుతున్నాయి.

మరొక ఉదాహరణం చూద్దాం విజయవిలాసం నుండీ --

**జలరుహగంధి వీనులపసల్ నవసంఖ్య నదేమి లెక్కనున్**
**జెలువ నఖాంకురాళి నెలచేడియ సై(పై)కముఁ దాను చుక్కనున్**
**బొలఁతుక గబ్బిచన్నుఁగవ పువ్వులచెండ్లను లేదు బంతనున్**
**గలికి ముఖారవింద మల కల్వలరాయని ద్రోసిరాజనున్**

ఇక్కడ రెండవపాదంలో సుభద్ర నఖాంకురసమూహం చంద్రునిభార్య అయిన తారయొక్క సైకాన్ని (సూక్ష్మతను) (పైకం అని పాఠాంతరం. ఆమె పైకం అంటే అందమే అని తాపీ వారి అర్థం) చుక్క అంటుందట. ఉచుక్ అంటుందని మరొక అన్వయం (తాన్ + ఉచుక్ + అనున్ అని అన్వయం – తాను–చుక్క–అనున్ అని మొదటి అన్వయం)

ఉచుక్ అంటే నిరాదరణధ్వని అని నిఘంటు నిర్ణయం. ఆ అర్థంలో ఈ పద్యంలో గుణదోష ప్రసక్తి లేదు. చుక్క+అనున్ అని వింగడించినప్పుడే గూఢార్థప్రసక్తి. చుక్క అంటే తార అన్నది ప్రసిద్ధమైన అర్థం. వ్యవహారంలో 'చుక్క' అంటే ద్వితీయస్థానం అని అర్థం. సిరి, చుక్క అని ప్రథమ ద్వితీయ స్థానాలను పరిగణించటం అనేకప్రాంతాలలో వున్న వ్యవహారమే. నెలచేడియ మోమును తాను–చుక్క అనున్ అన్నప్పుడు నెలచేడియ మోమును ద్వితీయస్థానానికి నెట్టివేస్తోందని భావం. అయితే ఈ అర్థంలో ఇది కావ్యప్రసిద్ధం కాదు. అందుకే ఉచుక్ అనున్ అని దాన్ని సమర్థించుకున్నారేమో!

వాస్తవానికి ఉచుక్ పదమే కవి ప్రయోగాలలో కనిపిస్తుంది. తొలితరం తెలుగుకవుల ప్రయోగాలలో లేకున్నా తదనంతరకవుల కావ్యాల్లో కనిపిస్తుంది.

అయితే చేమకూర వేంకటకవి భావించిన ప్రయోగం ఏదై ఉంటుంది? వాచా మనకు ప్రమాణాలు వుండవు. కాబట్టి పరిసరాలను బట్టి మనం అర్థనిర్ణయమో, ప్రయోగ నిర్ణయమో చేయవలసివస్తుంది.

ఆ పద్యంలోని నాలుగు క్రియలలో ఒకటి చుక్కనుట. మిగిలిన మూడు – ఏమి లెక్కనున్, లేదు బంతనున్, ద్రోసిరాజనున్. ఈ మూడింటికీ ఒకటి లేదా రెండు ప్రసిద్ధార్థాలు. ఒకటే ప్రసిద్ధార్థమనుకుంటే రెండవది అప్రసిద్ధార్థం. నవసంఖ్య కాబట్టి (ఒకే అంకె) లెక్కేముంది అనటం ఒకటి వాచా సరిపోయేది. రెండవది లెక్కలేనితనం. బంతి దగ్గరకూడా పంక్తి అని చెండు అని రెండు అర్థాలు. ద్రోసిరాజుకూ అంతే. ఉచుక్ అంటే మాత్రం అక్కడ ఒక అర్థానికే అవకాశం. కాబట్టి మిగిలిన మూడింటిని బట్టి నాలుగవది కూడా ఉభయార్థకమై చుక్కనున్ అనియే కావలసి వస్తుంది. అదే సముచితతరం ఉచుక్ కంటే.

అయితే ఒక అప్రసిద్ధార్థంలో వాడి గూఢార్థమనే దోషాన్ని స్వయంగా కవి చేస్తాడా అంటే ఆలోచించాలి. ఒక క్రమాన్ని చూద్దాం –

రెండూ అప్రసిద్ధార్థాలు అయితే సంయోగాది + అర్థ నియామకాల సహకారంతో ఒక అర్థాన్ని నిర్ణయిస్తే, ద్వితీయార్థ స్ఫూర్తి కలిగితే అది శబ్దశక్తిమూలధ్వని. శబ్దశక్తి చేత ఆక్షేపింప బడి, సభంగంగానో, అభంగంగానో రెండు అర్థాలను అందిస్తే అక్కడ శ్లేషాలంకారం.

నుడికారాలు, జాతీయాలు, పదబంధాలు, శబ్దపల్లవాల విషయంలో అభిధాలక్షణల సహకారంతో రెండు అర్థాలూ స్ఫురించి, చమత్కారాన్ని కలిగిస్తాయి. రెండింటిలో ఏ ఒక్కటైనా సరిపోతుంది కాబట్టి రెండింటికీ సమప్రాధాన్యం. అక్కడ దాన్ని శ్లేష అనవచ్చు. అభిధాకృతార్థ మొకటి. లక్షణాకృతార్థ మొకటి. అలా రెండర్థాలు ఉండవచ్చా అంటే స్ఫురిస్తున్న అర్థాన్ని నివారించటానికో, నియంత్రించటానికో ఎవరికి అధికార ముంటుంది. శబ్దశక్తిమూలధ్వని విషయంలో రెండవ అర్థం స్ఫురిస్తోంది కాబట్టే దానికి వ్యవస్థను ఏర్పరచుకొన్నది. ఆ రీతిగా అయినా గ్రహించవచ్చును పైన ప్రస్తావించిన పరిసరాలలో. ప్రత్యేకించి చేమకూర వేంకటకవి కవిత్వంలోని అటువంటి పద, పదబంధ ప్రయోగాలే అయనను ప్రతిపద్యచమత్కారిని చేసింది.

ప్రసిద్ధిని, అప్రసిద్ధిని నిర్ణయించటంలో దేశకాలాదులు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. లేకపోతే పొరపాటుపడే అవకాశ ముంటుంది. మహాభారతంలోని ఒక పద్యాన్ని చూద్దాం –

**ఓహో! యిట్లనుట జగ**
**ద్ద్రోహం; బిమ్మాట మఱువు; దూతత్వంబున్**
**మాహాత్మ్యంబును ధర్మో**
**త్సాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్**

ఉద్యోగపర్వం 3/170

రాయబారిగా వచ్చిన కృష్ణుని బంధించాలన్న తన ఆలోచనను సుయోధనుడు చెప్పినప్పుడు 'తగ'దంటూ ధృతరాష్ట్రుడు పలికిన మాట యిది. 'దూతత్వం, మాహాత్మ్యం, ధర్మోత్సాహం అబాధ్యతకు కారణాలు' బాధ్యత అంటే బాధ్యత వహించటం అని మనకు తెలుసు. అబాధ్యత అంటే బాధ్యత లేకపోవటం అని మనకు తెలిసిన అర్థం. మరి ధర్మోత్సాహం కూడా అబాధ్యతయేనా? ఇటువంటి మాట భారతంలోనా?

అత్యాధునికంగా 'Responsible' అన్న ఆంగ్ల పదానికి మనం చేసుకున్న అనువాదం బాధ్యత. దానితో అబాధ్యత అంటే irresponsible అని మనకు స్ఫురిస్తుంది. (మిగాతా 21వ పేజీలో)

## ఈనెల అంశం: రసాల సాలం

**డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

ఉ. భారతభూమి వేసవిని పర్వముగా రస భావ పుష్టి వి
స్ఫారితమై మెలంగెడు రసాల ఫలమ్ములు, విశ్వమందునన్
పేరిమి గూర్చి, యీ భువికి ప్రీతిని జాటు, ఫలమ్ములందు నొ
ప్పారును చక్రవర్తిగ మహత్వ పటుత్వ మధుత్వ సంపదన్

ఉ. కంతుని పుష్ప బాణమది కాంతుల జిందు వసంతమందునన్
స్వాంతము గంతులేయును ప్రవర్ధితమౌ ఋతు రాగ శోభలౌ
క్కింత గనంగ, కోకిలల గేహము గా విలసిల్లు చూత, వి
శ్రాంత మహీజముల్, కృతరసాలఫలమ్ముల అంకురప్రభల్

చ. శుకపికరావముల్ చెలగి శోభలు గూర్చు వసంతమందునన్
సకల మనోహరమ్ములు ప్రసన్నములైన విశాల పల్లవ
ప్రకటితమైన ఈ ప్రకృతి భాసురమై విలసిల్ల, పృథ్వికిన్
సకల దుకూల సంపదల జాలము లౌను రసాల సాలముల్

ఉ. బాల రసాల సాల నవ పల్లవ కాంతులు కంతు స్వాంతమున్
పాలన జేయు చుండగ, శుభప్రదుడైన వసంత మిత్రుడున్
కేలును తోడుగా నొసగ, కృష్ణ శుకమ్ముల రాగ సంపదల్
శ్రీలను జాట సాలముల చెంత, కనుంగవకున్ వరమ్ములౌ

చ. కనులకు విందు సేసెడు ప్రకాండములున్ స్తుతచూతమంజరుల్
వినుటకు సొంపు గూర్చు పరివేష్టిత శారిక రాగ వల్లరుల్
తనరు మనోహరమ్ములయి తత్పరతన్ పిక గాన రాగముల్
ప్రణుతములౌచు విశ్వమున వర్ధిలు స్త్రీ ప్రియమున్నుతించెదన్

**అసనారె, హైదరాబాద్**

ఉ. దైవము కాలముల్ గనుచు తా సృజియించుచు నుండ నెల్లెడన్
కావగ మానవాళినిల కర్కశ మైత్రమునందు, దివ్యమౌ
మావి రసాలసాలములు మాధురి కల్గు ఫలమ్ములీయగా
భావనచేసి పక్వమును పండ్లను కాయల పొంద మేలగున్

ఉ. మాధవ మాసమందునను మావి మహీజపు పల్లవమ్ములన్
మోదముతోడ నానుచును పోడిగ కోకిల లాలపించగా
స్వాదన చేయుచో మధువు బంబర ఝుంకృతి వింత గొల్పుచున్
కాదనలేని మాధురిని కల్గగ చేయును విన్నవారికిన్

చ. జలములు, లేనిచో కదు పసందగు చిన్నరసాల తోడుతన్
విలువగు పచ్చడిన్ గృహము ప్రీతిని చేయుచు నుంద్రు వేసవిన్
సలుపుచు సాయమున్ పొరుగు సఖ్యత తోడుత మేలు గూర్చ పె
ద్దలొసగు సూచనల్ మదిని దాలిచి పచ్చడి చేయుచుందురే

మ.కో. కత్తిపీటలు తెచ్చి యింటికి కత్తిరించుచు ముక్కలన్
ఉత్తమంబగు మావికాయల నూరగాయను చేయగా
మెత్తగా పోడి చేసి యాబలు మేలు కారము గల్పుచున్
గిత్త లాడెడి గానుగందున గిట్టు నూనెను కల్పెడిన్

## ఖండ-శర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**శతావధాని చేపూరి శ్రీరామ్**

ఉ. చూతపు వృక్షజాలములు సొంపుగ కొమ్మల నందగించగా
చేతము సంతసించు నలచేరిన వృక్షము నీడ నిచ్చు, ని
ర్ణీతపుకాలమందునను నిత్యము మామిడి పండ్లు గ్రోలినన్
స్ఫీతపు శక్తి కల్గు దరిచేరవు రోగము లాను వారికిన్

**పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు**

ఉ. శ్రేయముఁ గూర్చు సర్వమటు శ్రీకరమౌచు రసాలసాలముల్
కాయలు నూరగాయలకుఁ గమ్మదనమ్ము ఫలమ్ములందునన్
గోయిల వాసమై విరియఁ గొమ్మలు వృక్షమొసంగ నీడనున్
బాయక తోరణమ్ములకుఁ బత్రము లొప్పు శుభాన్వితాకృతిన్


శిఖరిణి రసోచ్ఛిష్టమ్మౌ తీపి ఫలములఁ బర్యాప్త నిధియై
ప్రసాదించంగన్ గ్రీష్మమున కదు సద్భాగ్య ధృతియై
పసందౌ భోజ్యమ్మై వరలు ముదమేపారఁగ జనుల్
రసాస్వాదా బంధమ్మున తనియరే రమ్యమనుచున్

కవిరాజ విరాజితము
మధుర రసాల సమావృత సాలపు మాన్యత శ్రేష్ఠము; మక్కువ మీ
ర ధరణి యందున రాజిలు స్వాదము రాజసమొప్పు ఫలమ్ములలో
సుధల ముదావహ శోభల నింపుచుఁ జూడ జనాళి విశుద్ధపు ప్రీ
తి ధృతిని మేలిమి తృప్తినిఁ గూర్చుచు ధీమస మొందుచు దీపిలవే!

పం.చా. రసాల సాలముల్ భుజించ రమ్యమౌ ఫలమ్ములన్
పసందటంచు నూరగాయఁ బ్రాప్తమొందఁ గాయలున్
వసించి పక్షులున్ దరించ భవ్య శాఖలన్ సదా
సుసార రీతిఁ గాంచి యొప్పు శోభిలంగ మానవుల్

చం. నిధిగ రసాల సాలములు నెమ్మినిఁ గూర్చఁగ మాన వాళికిన్
మధుర ఫలమ్ములన్ గనుచు మక్కువఁ దీర్చుచు స్వాస్థ్య మొప్పఁగన్
సుధలగు పోషణమ్మునిదు సూక్ష్మ పదార్థము లెన్నొ పూన్చుచున్
రుధిరము శుద్ధ మొందఁగను రుగ్మతలన్నియు వీడు రీతిగన్

**తదుపరి అంశం**
**అమ్మా బైలెల్లినాదో!**
పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది 15 జూలై 2026




# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

**'ఆగదు వీరరాఘవుని ఆశువు పార్థశరప్రయోగమే**
**ఆగిన ఆగు గాక, సముదగ్ర తపోధన శాపవాక్కులే**
**ఆగిన ఆగు గాక ... ... ...'**

అంటూ సాగిన ఈ పద్యం శతావధాని శ్రీ గాడేపల్లి వీర రాఘవ శాస్త్రిగారిది. తన ఆశుకవితా ధార ఎంతటి వేగవంతమో శాస్త్రి గారు ఘంటాపథంగా ఈ పద్యంలో ప్రకటించారు.

కర్నూలు జిల్లా మార్కాపురం తాలూకా ఎర్రగొండపాలెం గ్రామంలో 1891 ఏప్రిల్ 30న జన్మించిన శ్రీ గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి గారు సమధిక సంఖ్యలో అష్టావధానాలు, ఆశుకవితాసభలు, శతావధానాలు నిర్వహించిన విద్వత్కవి. వారు కొంతకాలం గద్వాల సంస్థాన ఆస్థానకవిగా రాణించారు. ఆయా సందర్భాలలో కవితామాలికలు చెప్పి రసజ్ఞులను రంజింపజేసారు. విశేషించి గంటకు ఒక శతకం చొప్పున ఎన్నో శతకాలు రచించారు. వారు నెల్లూరులో నిర్వహించిన శతావధానంలో ఒక పృచ్ఛకుడు 'పతి తల గోసి వండె నొక పాంథుని నాతి మనోహరంబుగన్' అను సమస్య నీయగా వారు ఔచితీమంతమగా ఇట్లా పూరించారు.

**చ. కుతుకము మీర శ్రీగిరికకుంఠిత భక్తిని పోవుచుండి వి**
**స్తృత నవపల్లవావృత దిదృక్షుముదావహ తింత్రిణీ కుజా**
**ప్రతిమపు నీడలో విడిసి, పుప్పుడికెత్తెడి నంత నా కురు**
**ట్పతి తల గోసి వండె నొక పాంథుని నాతి మనోహరంబుగన్**

అతిశయించిన కోరికతో అకుంఠితమైన భక్తితో శ్రీశైల క్షేత్రానికి ప్రయాణిస్తూ, విస్తరించిన క్రొత్త చిగురులతో చూచేవారికి ముచ్చట గొల్పే ఒక చింతచెట్టు (తింత్రిణీ కుజము) నీడలో ఆగి పప్పు ఉడికే సమయానికి చింతచిగురు (కురుట్పతి తల) కోసి ఒక బాటసారి యొక్క భార్య మనోహరంగా చింత చిగురుతో కూడిన పప్పు వండింది అని పద్యంలోని హృద్యభావన.

ఈ పూరణలో కవి వినూతన కల్పనాశక్తి అత్యంత శ్లాఘనీయం. 'కు'శబ్దానికి భూమి అని అర్థం. కురుట్ అంటే భూరుహము (చెట్టు) అని అర్థం. సమస్యలో పతి తలను కురుట్పతి తల (తింత్రిణీ భూరుహము యొక్క తల అనగా కొమ్మల పైభాగమున ఉండే చిగురు)గా పరివర్తింప జేసిన గాడేపల్లి వారి ప్రతిభ అప్రతిమానము.

వనపర్తి సంస్థానంలో గాడేపల్లి వారిని పరీక్షింప దలచి అక్కడి విద్వాంసులు **'భీష్ముని పెండ్లి కేగిరటు పిన్నలు పెద్దలు బంధులందరున్'** అను సమస్యనిచ్చి పూరింపుమన్నారు. భీష్ముడు ఆజన్మ బ్రహ్మచారి. ఆయన పెండ్లికి పిన్నలు, పెద్దలు బంధువులందరు వెళ్ళడమనేది సమస్యలోని అసంగతాంశము. ఈ సమస్యాపూరణ ఇలా మనోజ్ఞంగా సాగింది.

**ఉ. గ్రీష్మము లోన లగ్నమరిగెన్, సమకూర్చెద నన్న భార్గవా**
**ర్చిష్మదనూన కోపమతి శీతలమయ్యె, ప్రతిజ్ఞ చూడగా**
**భీష్మమునై చెలంగె, తలపెట్టని వన్నియు దాపురించె నా**
**భీష్ముని పెండ్లికి; ఏగిరట పిన్నలు పెద్దలు బంధులందరున్**

సమస్యాపాదంలోని 'ష్మ' దుష్కరప్రాసము నిఘంటుపరిజ్ఞానము ఉంటే తప్ప ఇలాంటి సమస్యలు పూరించడం సాధ్యపడదు.

గ్రీష్మములో (వేసవిలో) లగ్నమన్న సంగతి ఆగిపోయింది. ఎలాగైనా పెండ్లి జరిపిస్తానని అంబకు మాట ఇచ్చిన పరశురాముని (భీష్ముని గురువు) అగ్నివంటి తీవ్రమైన కోపం చల్లారింది. భీష్ముని ప్రతిజ్ఞ చూస్తే చాల భీకరంగా మారింది. ఈ విధంగా భీష్ముని పెండ్లికి ఊహించని ఆటంకాలెన్నో దాపురించాయి. కాగా పెండ్లికై విచ్చేసిన పిన్నలు పెద్దలు, బంధువులందరు ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారట. ఆహా!! ఎంత హృదయంగమమైన, రసమయోచితమైన చమత్కార కల్పన ఇది.

వీరరాఘవశాస్త్రిగారు 40 కి పై రచనలు చేసారు. శాస్త్రిగారి మనుమరాలు శ్రీమతి టి. భారతి గారు "గాడేపల్లి వీరరాఘవ శాస్త్రిగారి కావ్యములు – సవిమర్శక పరిశీలన" అను సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి నుంచి పట్టా పొందారు. ఇటువంటి అవధాని మూర్ధన్యులను కన్న ఈ తెలుగు నేల ధన్యము, మాన్యము.

(19వ పేజీ తరువాయి) **కావ్యదోషాలు**

ఇది ఇప్పుడు లోకప్రసిద్ధమైనా అసలు అది అర్థమే కాదు, శబ్దనిష్పత్తిని బట్టి. బాధ్ ధాతువు మీద బాధ్యః = బాధింపదగిన వాడు, బాధ్యత = బాధింపబడుట, అబాధ్యత = బాధింప బడకుండుట. ఇదీ అర్థక్రమం.

అంటే దూత గానీ, మహాత్ముడు గానీ, ధర్మోత్సాహం గలవాడు గానీ బాధింపదగనివాడు (ఆయా కారణాలచేత) అని అర్థం. నిజమే కదా!

ఆధునికంగా వచ్చిన అర్థవిపరిణామం (శబ్దస్వీకారం) కారణంగా అసలు అర్థం అప్రసిద్ధమన్న భ్రాంతికి కారణమైంది. తిక్కన కాలానికి ఆంగ్లం లేదు.

## ప్రహేళికా

సంస్కృతం మన భాషలకు అన్నింటికీ మూలం. దాంట్లో ఎన్నో చమత్కారాలు. ఒక పదంలో అక్షరం చేరిస్తే ఒకర్థం. అక్షరం తీసేస్తే మరొక అర్థం. ఇలాంటివి కోకొల్లలు. ఉదాహరణకు ఒక కవి చమత్కారశ్లోకంలో ప్రశ్న-సమాధానము రెండింటినీ జోడించి మనకు అందించాడు. అది -

కే దారపోషణరతాః,
కంబలవంతం న బాధతే శీతః ।
కం సంఘాన కృష్ణః
కా శీతలాంబు వాహినీ గంగా ॥

ఇది ఆర్యావృత్త శ్లోకం. దీనిలో దారపోషణరతాః కే? = అంటే భార్యను పోషించేవారు ఎవరు? అంటే కేదార-పోషణరతాః = కేదారమంటే భూమి, భూమిని దున్నే రైతులు అని అర్థం. కం బలవంతం న బాధతే శీతః = ఎటువంటి బలవంతుని చలి బాధించదు? అంటే 'కంబలవంతం' కంబళి అంటే గొంగడి కప్పుకున్నవాడిని చలి బాధించదు. కం సంఘాన కృష్ణః = శ్రీకృష్ణుడు ఎవరిని సంహరించాడు? కంసం = కంసుణ్ణి సంహరించాడు. శీతాంబువాహినీ గంగా కా? = చల్లని నీటితో ప్రవహించే గంగానది ఏది? ఎక్కడ అంటే కాశీ-తలాంబువహినీ = కాశీక్షేత్రంలో ప్రవహించే గంగానది చల్లగా ఉంటుంది అని అర్థం.

ఇలా ఒకే పదంలో వాక్యంలో కే? కం? కం? కా? అని ప్రశ్నలు వేసి మళ్ళీ అవే పదాలతో కలిపి సమాధానాన్ని చెప్పడమనేది నిజంగా మనకు విచిత్రంగా అనిపిస్తుంది కదూ! అదే మన గీర్వాణభాషలోని సౌందర్యం, శబ్దాలపై మన కవులకు ఉన్నటువంటి సాధికారత గోచరమవుతాయి.

- 'అవధాని' ముత్యంపేట గౌరీశంకర శర్మ

(13వ పేజీ తరువాయి) **నిఘంటు పరిజ్ఞానం**

పాదాది ప్రత్యంగ వర్ణనము చేయునపుడు స్త్రీపురుషులకు యోగ్యమైన ఉపమానములను పేర్కొన్నారు. ఇవి కవులకు, అవధానులకు అత్యంత ఉపయుక్తములు. ఉదాహరణకు రాజవర్ణనము చేస్తూ "విష్ణురివాహీనభోగసంగతశరీరో విపత్రాసనస్సుదర్శనాన్వితః" అన్నారు. దీనికి విష్ణువు వలే అధికమైన సుఖానుభవంతో కూడిన శరీరం కలవాడని, పక్షాంతరమున శేషుని యొక్క శరీరమున కూడియున్న శరీరము కలవాడని అర్థములు కలుగుచున్నవి. ఇట్టి నైపుణ్యమైన వర్ణనలు శ్రోతలకు మిక్కిలి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

# పద్యపరిమళం

## శుభలేఖల కట్ట

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.

ప్రకృతి పరిశీలన, ఆరాధన కవులకు ప్రీతిపాత్రమైన అంశాలు. సూర్యోదయ సూర్యాస్తమయాలు ప్రతినిత్యమూ జరిగేవే అయినా కవుల భావనలో అవి నిత్య నూతనాలు.

అస్తమిస్తున్న సూర్యబింబం ఎలా ఉంటుంది? పడమటి కొండమీదినుంచి సముద్రంలోకి జారిపోతున్నట్లు కనిపిస్తుంది. ఆ సమయంలో ఎరుపు పసుపులు కలగలిసిన బంగారు కాంతితో ప్రకాశిస్తూ ఉంటుంది ఆ సూర్యబింబం. చదువుకుంటూ క్రమంగా క్రిందికి చుట్టుకుంటూ వెళ్ళిపోతున్న బంగారు శుభలేఖల చుట్ట ఇదేనేమో అనిపిస్తుంది. ఆ బంగారు శుభలేఖల చుట్ట ఎక్కడిది?

సుభద్రార్జునుల వివాహం నిశ్చయంకాగా అర్జునుడి తండ్రి అయిన దేవేంద్రుడు పంపిన శుభలేఖల కట్ట అది. ఆ శుభలేఖలు ఎవరి కివ్వాలి?

కుమారుడి పెళ్ళికి దివినుంచి భువికి తాను సపరివారంగా వస్తూ భూలోకంలో అన్ని దిక్కుల వారినీ ఆహ్వానిస్తూ ఈ శుభ లేఖలు అందించమని సముద్రుడికి చెప్పాడు దేవేంద్రుడు. సముద్రుడు అంటే పడమటి దిక్కునకు అధిపతి అయిన వరుణుడు.

దిక్పాలకాధిపతి, దేవాధ్యక్షుడూ అయిన ఇంద్రుడు వరుణుణ్ణి ఈ పనికి పురమాయించాడు.

అలా వరుణుణ్ణి ఆజ్ఞాపిస్తూ దేవేంద్రుడు పంపిన బంగారు శుభలేఖల చుట్ట అన్నట్లుగా సూర్యుడు పడమటి కొండ శిఖరం చేరాడని "విజయ విలాసం" ప్రబంధంలో చేమకూర వేంకట కవి చమత్కరించాడు.

తనయుని పెండ్లి కేగవలె ధాత్రికి దిక్కుల నెల్ల తో
డ్కొని చనుదెమ్ము నీవ"ని కడున్ గుఱి చేసి సురాధినాథు డ
ప్పనపతి కంపినట్టి శుభవార్తల బంగరు కమ్మచుట్ట నా
దినకర మండలం బపర దిగ్గిరికూటము చేరె నయ్యెడన్.

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడుతాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# పద్యపరిమళం

**పంచ బ్రహ్మ సమాఖ్య పంచపృథివీ వ్యాఖ్యాది తత్త్వాధి పో**
**దంచిత్పంచ మహార్ణ శోభిత సురాధ్య క్షత్వ సంశోభితం**
**పంచాక్షర్యభిధాన మంత్ర విదితుం, పంచాక్షరాద్యక్షరా**
**కించిద్బోధితు సాంబునే మనములో గీర్తింతు నశ్రాంతమున్**

ఈ పద్యం అహోబల పండితుడు రచించిన కాళిందీ కన్యా పరిణయం కావ్యం లోనిది, సంస్కృతం తెలుగు భాషల్లో అపార మైన పాండిత్యం గల ఈ కవి 17 వ శతాబ్దాంతానికి చెందిన కవి. అహోబల పండితీయం అనే పేరు గల కవిశిరోభూషణం వీరి మరో కావ్యం.కావ్యారంభంలోని ఇష్ట దేవతాస్తుతిలో పరమశివుని స్తుతించిన పద్యం ఇది.

సృష్టి ,స్థితి, లయ,తిరోధాన, అనుగ్రహం అనే ఐదు కార్యాలను పంచకృత్యాలు అంటారు. ఈ ఐదు తత్త్వాలను నిర్వహించే బ్రహ్మ, విష్ణు రుద్ర ఈశ్వర సదాశివులనే పంచబ్రహ్మలు అంటారు. తిరోధాన ప్రక్రియలో పూర్తిగా లయమైన సృష్టి స్థితిని సదాశివుడు అమ్మ కృపాకటాక్షాలతో ప్రకాశం చేయడమే అనుగ్రహం. ఇది మొదటి నాలుగింటిని ప్రభావితం చేస్తుంది. అమ్మవారిని లలితా సహస్రనామాలు పంచకృత్య పరాయిణగా వర్ణించాయి. (శ్రీ పాలకుర్తి రామమూర్తి గారు –సౌందర్యలహరి)

సూతసంహిత శివుని ఐదు ముఖాలను పంచబ్రహ్మలుగా తెలియజేస్తుంది. దీని ప్రకారం పంచభూతాలు ఆవరించిన విశ్వం శివుని ఐదు ముఖాలతో నిర్వహించబడుతుంది.

ఈశానం – ఆకాశం, తత్పురుషం – గాలి, అఘోరం – అగ్ని, వామదేవుడు – నీరు, సద్యోజాత – భూమి. శైవ ఉపనిషత్తులలో పంచబ్రహ్మ ఉపనిషత్తు కూడా ఉంది.

ఇలాంటి పంచబ్రహ్మ సమాఖ్య తత్త్వం తో పరమశివుని వర్ణిస్తూ పద్యం ప్రారంభించారు కవి.తరువాత విశేషణం పంచపృథివీ వ్యాఖ్యాది తత్త్వాలకు అధిపతిగా శివుని పేర్కొన్నారు. పంచపృథివీ వ్యాఖ్యలు ఏముంటాయి అని ఆలోచిస్తే వ్యాఖ్యను సూక్తంగా భావిస్తే పృథ్వీసూక్తంతో పాటు పురుషసూక్తం శ్రీసూక్తం నారాయణసూక్తం నీలాసూక్తం ఈ ఐదూ పంచసుక్తాలు.

సబ్రహ్మః సశివః సహరిః అంటుంది పురుషసూక్తం. ఇది అద్వైత ప్రబోధం. ఇక్కడ శివుని అద్వైతమూర్తిగా భావిస్తున్నారు. తరువాత విశేషణంగా ఉదంచిత్పంచ మహార్ణ శోభిత సురాధ్యక్ష అంటే పంచ మహార్ణ అంటే పంచ సముద్రాల శోభలతో కూడిన దేవతల బృందానికి అధ్యక్షుడు. ఈ అన్వయం సరికాదనుకుంటే అర్ణవం అంటే అక్షరం అనే అర్థం కూడా ఉంది కాబట్టి ఐదు అక్షరాల పేరుతో సదాశివుడుగా పిలువబడుతూ దేవతల బృందానికి అధ్యక్షుడై శోభిల్లుతున్నవాడు, పంచాక్షర మంత్రంగా భావించే నమఃశివాయ అనే పేరుతో విదితుడైన వాడు

ఈ పంచాక్షరి మొదటి, రెండవ నాల్గవ అక్షరాలు ఉదాత్తము లనియు, మూడవది అనుదాత్తము ఐదవది స్వరితములనీ చెప్పబడింది. అంతేకాక రెండవ అక్షరం బీజం, నాలుగవ అక్షరం కీలకం ఐదవ అక్షరం శక్తి. దీనికి వామదేవుడు ఋషిఛందం పంక్తి. దేవత పరమశివుడే. ఐదు అక్షరములకు క్రమముగా గౌతముడు అత్రి విశ్వామిత్రుడుఅంగిరసుడు భరద్వాజుడు ఋషులు. గాయత్రి, అనుష్టుప్, త్రిష్టుప్, బృహతి విరాట్ అనునవి ఛందస్సులు ఇంద్రుడు రుద్రుడు హరి బ్రహ్మ స్కందుడు దేవతలు. పంచాక్షరి జప విధి సాక్షాత్తూ శంకరుడే వాయవీయ సంహిత ఉత్తరఖండంలో వివరించాడు. అందుకే పంచాక్షర మంత్ర విదితుడు. చివరి క్లిష్టమైన విశేషణం పంచాక్షర ఆద్యక్షర అకించిత్ బోధితుడు సాంబుడు. ఇక్కడ పంచాక్షర అంటే ఓంకారము. అకించిత్ బోధన అన్నారు అకించిత్ అంటే కొంచెం కూడా లేనిది. అంటే ఏమీ లేకుండా బోధ చేయడం అంటే మాట్లాడకుండా మౌనంగా బోధ చేయడం. అలా చేసినవాడు దక్షిణామూర్తి.

శంకరుని రూపమైన దక్షిణామూర్తి జ్ఞాన ప్రదాతను తన కావ్య రచన కు అవసరమైన జ్ఞానం ప్రసాదించమని ఎల్లప్పుడూ కీర్తిస్తుంటానని చెబుతూ కవి పద్యం ముగించాడు.

**- 'శతావధాని' చేపూరి శ్రీరామ్**

(10వ పేజీ తరువాయి)

## నన్నయ భట్టారకుని అచ్చిక పదప్రయోగము

దోడ్కొని పొ" మ్మనినది. ఇదే ద్రౌపది, యిదే విషయమును విజ్ఞులు ప్రాజ్ఞులు నున్న కౌరవ సభలో ప్రస్తావించినప్పుడు బహుళ సంస్కృత పద మిశ్రితమైన రెండు చంపకమాలలతో భాషించి భాసించినది.

ఇట్టివే – "నీవ కదు నేర్పుకాడవు.....(ఆది–6–33), "అనిలజ నీకిట్లని పల్కను..... (ఆది–6–59) వంటి వనేకము.

ఈవిధముగా నన్నయ్య సందర్భోచితముగా – కావ్యారంభములో సంస్కృత పండితజనామోదయోగ్యమైన సంస్కృత సమాసములను గుప్పించినను, తన హృదయేప్సితమైన యచ్చ తెనుగునకు గ్రంథార్హత కల్గించు నెట్టి యవకాశమును విడువలేదు. తరువాత నిది యొక కావ్యమర్యాద యైనది.

# సంస్కృతం సంస్కృతి 10

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

ధాతువుల గురించి గత సంచికలో కొంతవరకు తెలుసు కున్నాము. ఇక ఈ సంచికలో ధాతువులుకు సంబంధించిన మరిన్ని విశేషాలను చూసే ప్రయత్నం చేద్దాం. మానవశరీరమునకు ధాతుపుష్టి ఎంత ముఖ్యమో సంస్కృతభాషాప్రయోగాలకు కూడా ధాతు పుష్టి అంతే అవసరము.

ధాతువు అంటే క్రియాపదము యొక్క మూలరూపము అని చెప్పుకున్నాం. క్రియాపదములు ఏమి తెలియజేస్తాయి అంటే కాలమును, భావమును తెలియచేస్తాయి. తెలుగులో వర్తమానకాలము, భూతకాలము, భవిష్యత్కాలము అని మూడు రకాల కాలములను వినియోగిస్తాము. కానీ సంస్కృతములో అట్లు కాదు. ఇక్కడ ధాతువునుండి సాధించిన రూపాలను పది విభాగాలుగా చేసారు. వీటికి పాణిని దశలకారాలు అన్నాడు. లకారానికి టకారములో ఆరు రూపాలు ఙకారముతో 4 రూపాలు వెరసి 10 లకారాలు అన్నారు. అంటే లట్, లిట్, లుట్, ల్‌ఋట్, లేట్, లోట్, లఙ్, లిఙ్, లుఙ్, ల్‌ఋఙ్ అని పేర్లు. ఇవి 7 కాలాలను 3 భావాలను సూచిస్తాయి.

వర్తమాన కాలమును తెలియజేసే రూపము లట్ అని ఒక రకము. భూతకాలమునకు మూడు లకారాలున్నాయి. అవి లిట్, లఙ్, లుఙ్ అని పేర్లు. ఇవాళ అంటే అద్యతన అంటాము కదా. ఇవాళ లో గడిచిన కాలము అద్యతన భూతకాలము అంటారు. ఉదాహరణకి ఇప్పుడు ఉదయం 11 అయింది అనుకుందాం. సూర్యోదయమునుంచి ఇప్పటి 11 వరకు కాలము అద్యతన భూతకాలము. అలాగే నేటి సూర్యోదయమునకు ముందు జరిగిన కాలమును అనద్యతనభూతకాలము అంటారు. నేటిది కాని భూతకాలమన్నమాట. ఇవి రెండూ కాక మనకు తెలియని చాలా చాలా పాతకాలమును పరోక్షభూతకాలము అంటారు. అలాగే భవిష్యత్ కాలానికి రెండు రూపాలు. అద్యతన భవిష్యత్ అని, అనద్యతన భవిష్యత్ అని. అద్యతన భవిష్యత్ అంటే ఇందాకటి ఉదాహరణలో ఉదయం 11 తరువాత మర్నాడు సూర్యోదయము వరకు అద్యతనభవిష్యత్ కాలము. మర్నాడు సూర్యోదయమునుంచి తదుపరి కాలమంతా అనద్యతన భవిష్యత్ కాలము అన్నమాట. అలాగే 'ఇలా అయి ఉండి ఉంటే నేను ఇలా చేసి ఉండేవాడిని' అన్న ప్రయోగమును కూడా భవిష్యత్ కాలములో సూచిస్తారు.

ఉదాహరణకి భూ ధాతువు తీసుకుంటే వర్తమానకాలమునకు (లట్) రూపము 'భవతి'. అద్యతన భూతకాలము (లుఙ్) యొక్క రూపము 'అభూత్'. అనద్యతన భూతకాలము (లఙ్) రూపము 'అభవత్'. పరోక్ష భూతకాలము (లిట్) రూపము 'బభూవ'. 'రామోనామ బభూవ హుం' అని ప్రసిద్ధ శ్లోకం వినే ఉంటారుగా. ఇక అద్యతన భవిష్యత్ కాలము (ల్‌ఋట్) రూపము 'భవిష్యతి'. అనద్యతన భవిష్యత్ కాలము (లుట్) రూపము 'భవితా' అవుతుంది. ఇవి 6 కాలసూచక రూపాలు. ఇవి కాక (ల్‌ఋఙ్) అను రూపము కూడా ప్రత్యేకమైన భవిష్యత్ ని సూచిస్తుంది. మనం అంటామే 'నేను ప్రధానమంత్రినైతే నీకు....' అని ఇక్కడ 'అయితే' నే ఆ పని చేయడం అన్నమాట. అలాంటి సందర్భాలలో ఈ ల్‌ఋఙ్ రూపం 'అభవిష్యత్' రూపము వస్తుంది. (లేట్) అన్నది వేదములో వచ్చే రూపము. లౌకికసంస్కృతములో వినియోగము లేదు దానికి.

ఇక భావాలను తెలియచేసే రూపాలు ఆజ్ఞార్థములో (లోట్) 'భవతు/భవతాత్' అను రూపములు,(లిఙ్) లో రెండు రకాలు విధ్యాదిలిఙ్ లో 'భవేత్' అని, ఆశీర్లిఙ్ లో 'భూయాత్' అని రూపాలు ఏర్పడుతాయి.

ఇక ప్రతి లకారమునకు తొమ్మిది రూపాలు ఉంటాయి. తెలుగులో వలెనే మూడు పురుషలు. ఇక్కడ వచనములు మూడు. ప్రథమ పురుష, మధ్యమపురుష, ఉత్తమపురుష అని పురుషలు. ఏకవచనము, ద్వివచనము, బహువచనము అని వచనములు. వెరసి 9 రూపాలు. ఇలా 10 లకారాలకు కలిపి 90 రూపాలు వస్తాయి. ఇలా 2200+ ధాతువులకు రూపాలు ఇచ్చారు. అయితే ఇన్ని గుర్తుపెట్టుకోవడం కష్టం అనుకోనక్కరలేదు. అందుకే ఈ ధాతువులను 10 గణములుగా విభజించినారు. ప్రతి గణములోనూ ధాతువును నుండి క్రియాపదము సాధించుటకు వచ్చే మార్పులు ఇంచుమించు సమానముగా ఉంటాయి. కనుక ప్రతి గణములోని కనీసం ఒక ధాతువుని నేర్చుకుంటే ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రూపాలు వచ్చినట్లే. సంధికార్యములవల్ల కొంత రూపములలో భేదము వస్తుంది కాని అభ్యాసముతో అన్నీ స్పష్టమౌతాయి.

మరొక్క విషయము. సంస్కృతము ప్రచారము విస్తృతముగా చేసే ఉద్దేశముతోనో మరేమైనా కానీ ఈ పది లకారాలను కాక కేవలం 5 లకారాలనే నేర్పిస్తున్నారు. అంటే భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు ఒకటి వంతున, విధ్యాది, ఆశీః కి రెండు రూపాలను మాత్రమే చెప్తున్నారు. ఇది తప్పు అనలేము కానీ పది లకారాల సాధన విశేషము అని చెప్పాలి. ఇంకొకటి గమనించారో లేదో, ప్రతిచోటా 'విధ్యాది' అన్నాము. అంటే విధి, ఆమంత్రణ, నిమంత్రణ ఇత్యాది పలు సందర్భాలలో ఈ లిఙ్ రూపాన్ని వినియోగించవచ్చు. ఇలా ప్రతి విషయములోనూ సమగ్రమైన అవగాహన కలిగితే అవధాని తన అవధాన ప్రక్రియలో సందర్భానుసారముగా సమంజసమైన రూపమును ఎన్నుకునే అవకాశం కలిగియుంటాడు.

వీటికి ధాతురూపమంజరి, ధాతుచంద్రిక ఇత్యాది అనేక గ్రంథములు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికాలములో ఆన్‌లైన్‌లో కూడా చాలా వెబ్సైట్‌లలో ప్రతి ధాతువుకి రూపాలు లభిస్తున్నాయి. మీకు కుదిరిన, నచ్చిన చోట గ్రహించి రూపసాధన చేయడం మాత్రం ముఖ్యమైనది.



శ్రీ గట్టెడి విశ్వంత్ గారి అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం



శ్రీ భైరవనేని పోతురాజు చౌదరి గారి అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం



చి.వింజమూరి సంకీర్త్యశర్మ అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం



మంచినీళ్ల రామ సరస్వతి గారి అష్టావధానం - అవధాన విద్యా వికాస పరిషత్ 5వ అవధాన,పద్య శిక్షణ శిబిరం

అవధాన విద్యా విజయతే తరామ్

**Avadhana Puskarini**
17 JUNE 2026




అవధాన విద్యా వికాస పరిషత్ ఐదవ అవధాన, పద్య శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ సభ




అవధాన విద్యా వికాస పరిషత్ ఐదవ అవధాన, పద్య శిక్షణ శిబిరంలో 'అవధాన పుష్కరిణి' ఆవిష్కరణ




అవధాన విద్యా వికాస పరిషత్ ఐదవ అవధాన, పద్య శిక్షణ శిబిరం సమాపనోత్సవం

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146